

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 1 జూన్ 2026 | వెల : 4/-




# తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టిస్తున్న వాతావరణం

ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ రాష్ట్ర ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరనుంది. రాష్ట్రంలోని 119 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 155 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 నుంచి 46 డిగ్రీల వరకు నమోదయ్యే ప్రమాదం ఉంది. అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గరిష్టంగా 43 నుంచి 44 డిగ్రీల తీవ్రతతో ఎండలు మండిపోనున్నాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, దక్షిణ తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల వాతావరణం చల్లబడనుంది. బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.




## ఈ ఏడాది చివర్లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు

- సీఎంసీ, ఎంఎంసీలకు విడిగా ఆ తర్వాత!
- మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో మొదటగా జీహెంచ్ఎంసీకే ఎన్నికలు
- బీసీ సర్వే రిపోర్టుల ఆధారంగా రిజర్వేషన్ల ఖరారు
- అనంతరం ఎన్నికల ప్రకటన
- ఊపందుకోనున్న ప్రక్రియ

హైదరాబాద్

రాజధాని మహా నగరం హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో తొలుత జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్)కే ఎన్నికలు జరగబోతున్నాయి. నవంబరులో ఎన్నికలు నిర్వహించాలని సంబంధిత అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సర్ పేరుతో జరగనున్న ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుంది. దీంతో ఆ ఓటరు జాబితా ఆధారంగా అదే నెలలో కొత్తగా ఏర్పడిన డివిజన్లకు పోలింగ్ సెంటర్లను నిర్ణయిస్తారు. కాంగ్రెస్ - మిగతా3లో

## విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

- దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ విద్యా వ్యవస్థ ఉండాలనేదే మా లక్ష్యం
- విద్యే అభివృద్ధికి తొలి కొలబద్ద
- పేదరిక నిర్మూలనతో పాటు సమాజాన్ని జాగృతం చేసే శక్తి విద్యకే ఉందని
- ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిరంతరం కృషి చేస్తున్నాం
- విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా తానే చేపట్టా



హైదరాబాద్

విద్యే అభివృద్ధికి తొలి కొలబద్ద అని, పేదరిక నిర్మూలనతో పాటు సమాజాన్ని జాగృతం చేసే శక్తి విద్యకే ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా తానే చేపట్టానని తెలిపారు. గత రెండేళ్లలో విద్యారంగంలో పలు సంస్కరణలు అమలు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, కొత్త ఉపాధ్యాయుల - మిగతా3లో



## తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా

- సీబీఎస్ఈ వివాదంపై కాంగ్రెస్ ధ్వజం
- కేంద్రంలోని మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు
- మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారన్న హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

## సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి

- మే 30తో ముగిసిన జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం
- ఆయన స్థానంలో సీడీఎస్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన రాజా సుబ్రమణి
- సాయుధ బలగాల్లో స్వదేశీ ఆయుధాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని వెల్లడి

## సర్‌పై అప్రమత్తంగా ఉండండి.. అర్హుల ఓట్లను కాపాడండి

- 2028లో బీఆర్ఎస్ గెలుపు తథ్యం.. కేటీఆర్ కీలక సూచనలు
- 18 ఏళ్లు నిండిన వారి పేర్లను విధిగా నమోదు చేయించాలి
- 2025 ఓటరు లిస్ట్ ప్రకారం మొత్తం 3.39 కోట్ల ఓట్లు ఉన్నాయి
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పోలింగ్ బూతులు 35,985 ఉన్నాయి




హైదరాబాద్

ఓటు అనేది ప్రతి ఒక్కరి హక్కు అని కేటీఆర్ తెలిపారు. అంబేద్కర్ మనకు ఓటు హక్కు కల్పించారని పేర్కొన్నారు. సర్‌పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వాళ్లందరూ ఓటు ఎన్‌రోల్ మెంట్ చేసుకోవాలన్నారు. 2025 ఓటరు లిస్ట్ ప్రకారం మొత్తం 3.39 కోట్ల ఓట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పోలింగ్ బూతులు 35,985 ఉన్నాయని చెప్పారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య - మిగతా3లో



## ఎండలున్నాయ్ జాగ్రత్త

- ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి'.. ప్రజలకు మోదీ మరోసారి సూచనలు
- ప్రధాని మోదీ 'మనసులో మాట' 134వ ఎపిసోడ్
- ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ
- మన్‌కీ బాత్‌లో గుర్వీందర్, అనిమేష్‌తో మాట్లాడిన ప్రధాని
- ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి
- చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం
- అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.

# ఎండలున్నాయ్ జాగ్రత్త

మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలని మరోసారి సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం తాగే పానీయాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మజ్జిగ, షర్బత్, తదితర పానీయాలను తాగాలని ప్రజలకు సూచించారు. ఆ తర్వాత కేరళ ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. 15 వేల మంది ఔత్సాహికులకు క్లబ్ నిర్వాహకులు ఉచితంగా ఈత నేర్పించారని తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు రికార్డులు సృష్టించారని అన్నారు. వంద మీటర్ల పరుగులో గుర్వీందర్, అనిమేష్ రికార్డులు సృష్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గుర్వీదర్, అనిమేష్ పరుగు పందెంలో తమ అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు. అలాగే, పురాణ కాలం నాటి అపూర్వ సంపద గురించి మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామర పత్రాల విశిష్టత, ఛత్తీస్‌గఢ్‌లో లభించిన పాండవుల కాలం నాటి తామరపత్రాల గురించి వివరించారు.




"కొద్ది రోజుల క్రితం నెదర్లాండ్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. అక్కడ నేను అనేక సమావేశాల్లో పాల్గొన్నాను. అయితే, అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారత్‌కు అప్పగించారు. అంతేకాదు, ఆ కార్యక్రమానికి నెదర్లాండ్స్ ప్రధాని కూడా హాజరయ్యారు. ఈ ఫలకాల గురించి దేశం నలుమూలలు, విదేశాల నుంచి నాకు నిరంతరం సందేశాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజాల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం నెలకొని ఉంది. వీటిలో 21 పెద్ద, 3 చిన్న రాగి ఫలకాలు ఉన్నాయి. అవి ప్రధానంగా మొదటి రాజేంద్ర చోళ మహారాజుకు సంబంధించినవి. ఆనైమంగళం గ్రామాన్ని బౌద్ధ విహారానికి ఇచ్చినట్లు ఇందులో పేర్కొన్నారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరిస్తాయి. ఆ రాజవంశం బలమైన సముద్ర శక్తిని చూపిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి. చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం. అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది." ఖగోళ శాస్త్రం తరతరాలుగా భారతీయులను ఆకర్షించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బెంగళూరు ఖగోళ సొసైటీ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మోదీ నొక్కి చెప్పారు. అలాగే, రాత్రిపూట నక్షత్రాలను చూడటం అనేది ఒక అద్భుతమైన అనుభవమని, ఆస్ట్రో కేరళ అనే సంస్థ రాత్రిపూట పరిశీలన శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అక్కడి యువత టెలిస్కోపులు తయారు చేయడం, నక్షత్ర పటాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నారని అన్నారు. "రాజ్‌కోట్‌లోని బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు అనేక ఖగోళ శాస్త్ర కార్యక్రమాలను నిర్వహించింది" అని మోదీ అన్నారు.

**మన్ కీ బాత్ స్ఫూర్తితో సైనికులకు విరాళం**

మరోవైపు, తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన విద్యావేత్త గిరిజా అమ్మ గురించి మోదీ మాట్లాడారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయంతో సహా 15 పాఠశాలలను నడుపుతున్నారని చెప్పారు. ఆమె దేశభక్తి స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఉత్తేజం ఇస్తుందన్నారు. "మన్ కీ బాత్ స్ఫూర్తితో, ఆమె దేశంలోని అనేక మంది సైనికులకు విరాళం ఇవ్వడానికి ప్రతిజ్ఞ చేశారు. ఇది చేయడానికి, ఆమె తన పాఠశాలలన్నింటిలోని విద్యార్థులను ప్రేరేపించారు. ధైర్యవంతులైన సైనికుల కోసం ప్రతిరోజూ ఒక రూపాయి విరాళంగా ఇవ్వమని ఆమె పిల్లలను కోరారు. అంటే, ప్రతి విద్యార్థి ఒక సంవత్సరంలో 365 రూపాయలు సేకరించారు. ఈ చిన్న విరాళాల ద్వారా సుమారు 40 లక్షల రూపాయలు సేకరించారు" అని మోదీ పేర్కొన్నారు. చెన్నైలోని మొట్టమొదటి హిందూ పాఠశాల గత సంవత్సరం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుందని మోదీ పేర్కొన్నారు. "దేశ విద్య, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలల పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను. ముఖ్యంగా మన ధైర్యవంతులైన సైనికులకు విరాళాలు అందించిన విద్యార్థులను ప్రశంసిస్తున్నాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలో, నగరంలో మనకు స్ఫూర్తినిచ్చే ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

## సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి




భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ ఎన్. ఎస్. రాజా సుబ్రమణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30న ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఢిల్లీలోని సౌత్ బ్లాక్ లాన్స్‌లో జనరల్ రాజా సుబ్రమణికి త్రివిధ దళాలు గౌరవ వందనాన్ని సమర్పించాయి. అనంతరం దేశ రాజధానిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. పాకిస్థాన్, చైనా వ్యవహారాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందిన సుబ్రమణి, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)లో సైనిక సలహాదారుగా సేవలు అందించారు. గతేడాది జులై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన పదవీ విరమణ చేశారు. సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. సైనిక దళాల బలోపేతం, త్రివిధ దళాల మధ్య సమన్వయం, ఏకీకరణకు సంస్థాగతంగా సంస్కరణలు తేవడమే తన లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. సాయుధ దళాలు అంకితభావం, ధైర్యం, వృత్తి నైపుణ్యంతో దేశానికి సేవ చేయడం కొనసాగిస్తాయని, ఈ మేరకు దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, రాజా సుబ్రమణి సీడీఎస్ పదవితో పాటు భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్' సెక్రటరీగా కూడా బాధ్యతలను నిర్వర్తించనున్నారు. "భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు గౌరవంగా ఉంది. సాయుధ దళాలపై దేశం ఉంచిన నమ్మకానికి మేం కృతజ్ఞులం. భారతదేశ భద్రతను బలోపేతం చేసే 'సమగ్ర దేశ విధానంలో' భాగంగా మేం, భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, రక్షణ మంత్రిత్వ శాఖ, వ్యూహాత్మక సంస్థలు, సంబంధిత వర్గాలన్నీ ఐక్యంగా నిలుస్తాం. ఈ ప్రయాణంలో ఆదర్శప్రాయమైన నాయకత్వానికి, సహకారానికి గాను, నా విశిష్ట పూర్వాధికారులైన దివంగత జనరల్ బిపిన్ రావత్, జనరల్ అనిల్ చౌహాన్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన సైనికులు, నావికులు, వాయుసేన యోధుల ధైర్యాన్ని, వృత్తి నైపుణ్యాన్ని మేం ఎప్పుడు గుర్తుంచుకుంటాం. వారి శిక్షణ, సంక్షేమం మా ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుంది. వారి శౌర్యం, త్యాగం, దేశభక్తి మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. మన మాజీ సైనికులు, వీరనారీల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. సాయుధ దళాలు అంకితభావం, ధైర్యం, గౌరవం, వృత్తి నైపుణ్యంతో దేశానికి సేవ చేస్తూనే ఉంటాయని నేను భారత పౌరులకు హామీ ఇస్తున్నాను."

**'ఆత్మనిర్భరత మన జాతీయ భద్రతకు మూల స్తంభం'**

మరోవైపు, ఆత్మనిర్భరత గురించి కూడా సీడీఎస్ మాట్లాడారు. "ఆత్మనిర్భరత మన జాతీయ భద్రతకు మూల స్తంభం. ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్ అనే దార్శనికతను అమలు చేయడానికి మేం కట్టుబడి ఉన్నాం. సాయుధ దళాల పరివర్తన, జాయింట్‌నెస్, సినర్జీ, ఇంటిగ్రేషన్‌ను పెంపొందించే దృష్టి కేంద్రీకరిస్తాం. అలాగే, మన సాయుధ దళాల్లో స్వదేశీ ఆయుధాల అభివృద్ధి, ప్రవేశం, ఏకీకరణను వేగవంతం చేస్తాం. ఆలోచన, కార్యచరణలో నూతనత్వం మన సామర్థ్యానికి, అభివృద్ధికి చోదకశక్తిగా ఉంటాయి. సైన్యం, పరిశ్రమ, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా వ్యవస్థల మధ్య అధిక సహకారం ఆధునీకరణకు కీలక చోదకశక్తిగా ఉంటుంది. మన జాతీయ ప్రయోజనాలను కాపాడటంలో మన సాయుధ దళాలు నిరంతరం వృత్తి నైపుణ్యాన్ని, కార్యాచరణ నిర్ణయాత్మకతను ప్రదర్శించాయి" అని సుబ్రమణి తెలిపారు.

# తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా

సీబీఎస్ఈ మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగిన విద్యార్థులు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారని విమర్శించింది. విద్యార్థులు ధైర్యవంతులైన యువ భారతీయులని కొనియాడింది. మోదీ సర్కార్‌ను ప్రశ్నించిన విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు అర్హులని అభిప్రాయపడింది. వారు మంచి భవిష్యత్తును పొందేలా తాము చూస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కొంతమంది విద్యార్థులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తన సోషల్ మీడియా ఖాతాలలో పోస్ట్ చేశారు. గాంధీ ఈ వీడియో క్లిప్‌ను తన తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో జరిపిన అసలు విషయాలు బయటపెట్టే సంభాషణగా అభివర్ణించారు.

**'స్టూడెంట్స్ అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు'**

"వేదాంత్, అతని స్నేహితులు తెలివైన, ధైర్యవంతులైన భారతీయ యువకులు. వారు సీబీఎస్ఈ, మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగారు. కానీ సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారు. ఆ స్టూడెంట్స్ ఉజ్వలమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అర్హులు. ఆ భవిష్యత్తును పొందేలా మేము చూస్తాం. విద్యార్థులు తమ జవాబు పత్రాలను అడిగారు అంతే. దీంతో స్టూటెండ్స్ కాస్త అకస్మాత్తుగా దేశద్రోహులుగా మారిపోయారు. సమస్యను అంగీకరించడానికి ప్రభుత్వం నిరాకరిస్తోంది. అందుకు బదులుగా పేద విద్యార్థులను నిందిస్తోంది. డీప్ స్టేట్, గూఢాచారులు, ఉగ్రవాదులు అని ముద్ర వేస్తోంది." అని విద్యార్థులతో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**డీప్ స్టేట్ ఏజెంట్లు, పాకిస్థానీలు అని విద్యార్థులపై ముద్ర వేస్తున్నారు : ఖర్గే**



మరోవైపు, సీబీఎస్ఈ వివాదంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆందోళనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థుల మాట వినకుండా, వారిపై 'డీప్ స్టేట్ ఏజెంట్లు', 'పాకిస్తానీలు' అని ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. విద్యా రంగంలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా సీబీఎస్ఈ విద్యార్థులు, నీట్ అభ్యర్థులు ఇద్దరూ బాధితులుగా మారారని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రతిభను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ విద్యా సంస్థలు, ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని సర్కార్ హయాంలో పతనాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. నిరసన తెలిపే, సమస్యలను లేవత్తిన యువత గొంతులను మోదీ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. నిరాధారమైన ఆరోపణలతో యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. దేశ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో బీజేపీ విఫలమైందని, నియామక పరీక్షలను తప్పుగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

"విద్యార్థులు పరీక్షా యోధులుగా నిలవడానికి ఎగ్జామ్‌కు బయలుదేరారు. కానీ అందుకు బదులుగా వారిపై డీప్ స్టేట్ ఏజెంట్లు, పాకిస్తానీలు అని ముద్ర వేశారు. సీబీఎస్ఈ విద్యార్థులదైనా, నీట్ ఆశావహులదైనా అదే పరిస్థితి. మోదీ ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోంది. దేశ యువతను తమ అవినీతి వలలో చిక్కుకునేలా చేసింది. ఒకప్పుడు ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు వంటివి దేశ ప్రతిభను పెంపొందించేవి. ఇప్పుడు బీజేపీ దోపిడీ కారణంగా ఒక్క బోర్డు పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతున్నాయి. ఆ సంస్థలను బీజేపీ ఈ దుస్థితికి తీసుకువచ్చింది. ప్రభుత్వం విద్యా సంస్థలను బలహీనపరుస్తోంది. విద్యార్థుల గొంతుకను అణచివేస్తోంది. యూజీసీని నాశనం చేసింది. విశ్వవిద్యాలయాల్లో కక్షపూరిత రాజకీయాలను రెచ్చగొట్టింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రను తొలగించింది. వీసీల నియామకాలు సైద్ధాంతికంగా ప్రభావితమయ్యాయి. దేశంలో 90,000కు పైగా ప్రభుత్వ పాఠశాలను మూసివేసింది. గత కొన్నేళ్లుగా బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపును తగ్గించింది."

**ఇదొక భారీ డేటా లీక్ : జైరాం రమేశ్**

సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదం నేపథ్యంలో కేంద్రమే టార్గెట్‌గా కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ విమర్శనాస్త్రాలు సంధించారు. మంత్రి ప్రధాన్ కుంభకోణాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన నేడు 20 లక్షల 12వ తరగతి విద్యార్థుల జవాబు పత్రాలు బహిరంగంగా అందుబాటులోకి వచ్చాయని ఆరోపించారు. ఇది 20 లక్షల మంది విద్యార్థుల గోప్యతను ప్రమాదంలో పడేసిన ఒక భారీ డేటా లీక్ అని అభిప్రాయపడ్డారు. దీంతో కోఎంప్ట్ అసమర్థత, నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైందన్నారు. ఆర్ఎఫ్‌పీ సాంకేతిక నిబంధనలను మార్చి సీబీఎస్ఈ కాంట్రాక్టును కోఎంప్ట్‌కు ఇచ్చారని అన్నారు. ఈ మార్పు బహుశా కోఎంప్ట్‌కు ప్రయోజనం చేకూర్చి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. "లీక్ అయిన జవాబు పత్రాలలో కాగితం మడతలు, డ్రాప్ షాడోల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా స్కానింగ్ మెషీన్లకు బదులుగా మొబైల్ ఫోన్లతో చేసిన స్కాన్‌లలో కనిపించే గుర్తులు ఇవి. మూడో ఆర్ఎఫ్‌పీలో రోబోటిక్ స్కానర్ల అవసరాన్ని తొలగించారని మనకు తెలుసు. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కోఎంప్ట్ నిజానికి ఎలాంటి స్కానర్లను ఉపయోగించింది? స్కాన్ నాణ్యత ఎందుకు ఇంత పేలవంగా ఉంది?" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## హెల్మెట్ పెట్టుకోకపోయి ఉంటే అభిషేక్ చనిపోయేవాడు

## మేనల్లుడిపై జరిగిన దాడిపై మమత ఫైర్

తన మేనల్లుడు, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిపై బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సోనార్‌పుర్‌లో అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి తర్వాత ఆయన ఛాతీలో రక్తపు గడ్డలు ఏర్పడ్డాయని తెలిపారు. ఎవరో అభిషేక్‌కు హెల్మెట్ పెట్టకపోయి ఉంటే ఆయన చనిపోయి ఉండేవాడని ఆరోపించారు. ప్రజలు రాళ్లు విసరడం, శారీరకంగా దాడి చేయడం వల్ల తన మేనల్లుడి ఛాతీ, పక్కటెముకల ప్రాంతంలో గాయాలయ్యాయని పేర్కొన్నారు. అభిషేక్‌కు సరైన చికిత్స అందించకుండా ఉండేందుకు ఆస్పత్రులపై పైనుంచి ఒత్తిడి ఉందని విమర్శించారు.

**పోలీసులు భద్రత కల్పించలేకపోయారు : మమత**

అభిషేక్‌కు చికిత్సను విశ్వసనీయ వైద్యులు తమ కుటుంబ వైద్యుల పర్యవేక్షణలోనే కొనసాగించాలని మమతా బెనర్జీ కోరారు. అభిషేక్ సోనార్‌పుర్ పర్యటన గురించి పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, వారు ఎందుకు తగిన భద్రత ఏర్పాట్లు కల్పించలేకపోయారని ప్రశ్నించారు. హింసను సృష్టించేందుకే బీజేపీ బయటి వ్యక్తులను రప్పించిందని ఆరోపించారు. బీజేపీ చట్ట ప్రకారం పనిచేయాలని కోరారు. కాషాయం పార్టీ కనీసం ఎవరినీ చికిత్స పొందనీయడం లేదని ఆరోపించారు. ఆస్పత్రికి వచ్చినవారిలో ఎవరికి చికిత్స చేయాలి? ఎవరికి చేయకూడదు? అనే దానికి బీజేపీ నుంచి అనుమతి కావాలని మండిపడ్డారు. అంత అమానవీయంగా బీజేపీ తయారయ్యిందని ఫైర్ అయ్యారు. "నిజంగా అభిషేక్‌ను ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరం లేకపోతే అతడిని మొదట ఐసీయూకి ఎందుకు తరలించారు. పలు వైద్య పరీక్షలు, స్కాన్‌లు చేయించుకోమని ఎందుకు సలహా ఇచ్చారు? అభిషేక్‌ను పరీక్షించిన డాక్టర్లు పలు గాయాలను గమనించారు. తక్షణ వైద్య పరీక్షలు చేయించుకోమని అభిషేక్‌కు సలహా ఇచ్చారు. అభిషేక్ ముఖం, వీపు, ఛాతీ, మెడపై పలు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన రోగికి చికిత్స అందించే విషయంలో వైద్యులు, ఆస్పత్రి అధికారులపై ఒత్తిడి తేవడం అత్యంత ఆందోళనకరమైన అంశం. రోగిని ఆస్పత్రిలో చేర్చుకోవడం, డిశ్చార్జ్ చేయడం, చికిత్స అందించడం వంటి నిర్ణయాలు పూర్తిగా వైద్యులకు సంబంధించిన అంశంగా ఉండాలి. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలి. రాజకీయ విభేదాలకు హింస, బెదిరింపులు, ఆయుధాలు ఏమాత్రం పరిష్కారం కావు. బీజేపీ అభిషేక్ బెనర్జీకి చికిత్స అందకూడదనే ఉద్దేశంతో అన్ని ఆస్పత్రులను బెదిరిస్తోంది. నేను ఓ ఆస్పత్రి నిర్వాహకుడితో కూర్చున్నప్పుడు తనకు పోలీసుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన నాతో చెప్పారు. వైద్యులు బాధలో ఉన్నారు. వారిపై ఒత్తిడి ఉంది. రాహుల్ గాంధీ నాకు ఫోన్ చేశారు. అభిషేక్ బెనర్జీని చికిత్స కోసం హైదరాబాద్‌కు గానీ లేదా మరెక్కడికైనా తరలించమని సూచించారు"

**నాపై దాడికి బీజేపీయే కారణం : అభిషేక్**

తనపై దాడికి బంగాల్‌లో ఇటీవలే అధికారంలోకి వచ్చిన బీజేపీయే కారణమని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఇదంతా బీజేపీ ప్రేరేపిత చర్యే అని మండిపడ్డారు. ఇదేనా బీజేపీ ప్రజాస్వామ్య నమూనా? ఎన్నికలు జరిగి కనీసం నెల రోజులు కూడా గడవకముందే ఇలా చేస్తున్నారని విమర్శించారు. తన రాజకీయ ప్రత్యర్థులను హత్య చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. కాగా, అభిషేక్‌పై దాడి ఘటనలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు అభిషేక్‌పై దాడిపై తృణమూల్ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీజేపీ ధీటుగా తిప్పికొట్టింది. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని 'కర్మ రిటర్న్స్'గా బీజేపీ నాయకురాలు కీయా ఘోష్ వ్యాఖ్యానించారు. "గత 15 ఏళ్లుగా తృణమూల్ ప్రభుత్వ హయాంలో బంగాల్ ప్రజలు అనేక అకృత్యాలను చూశారు. ఈ రోజు వారికి (అభిషేక్‌కు) ఆ కర్మ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. కర్మ అంటే ఏమిటో మీకు తెలుసా? మీరు ఏది చేశారో, అదే మీకు తిరిగి లభిస్తుంది" అని ఆమె తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు కూలీల దుర్మరణం



**బెంగళూరు:** కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి టౌన్ సమీపంలోని జాతీయ రహదారి 44పై జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు బాగేపల్లి టౌన్ శివారులోని గంగోత్రి పెట్రోల్ బంక్ సమీపంలో తమ విధులు ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా, వేగంగా వచ్చిన ఒక ట్రక్కు వారి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోను ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## యూపీ డీజీపీగా రాజీవ్ కృష్ణ.. నాలుగేళ్ల తర్వాత పర్మినెంట్ డీజీపీ నియామకం




ఉత్తర ప్రదేశ్ నూతన డీజీపీగా రాజీవ్ కృష్ణ నియామకమయ్యారు. నాలుగేళ్ల తర్వాత యూపీకి పర్మినెంట్ డీజీపీ నియామకమవ్వడం విశేషం. 2022 వరకు యూపీలో పర్మినెంట్ డీజీపీనే ఉండేవారు. చివరి పూర్తిస్థాయి డీజీపీగా ముకుల్ గోయెల్ ఉండేవారు. అప్పట్లో ఆయనను ప్రభుత్వం తొలగించింది. ఆ తర్వాత నుంచి యూపీలో తాత్కాలిక డీజీపీలనే ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. డీఎస్ చౌహాన్, ఆర్కే విశ్వకర్మ, విజయ్ కుమార్‌లు డీజీపీలుగా పని చేశారు. చివరగా 2025 మే నెలలో ప్రశాంత్ కుమార్‌ను తాత్కాలిక డీజీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పుడు ఆయన స్థానంలో రాజీవ్ కృష్ణ పూర్తిస్థాయి డీజీపీగా కొనసాగుతారు. ఆయన 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఆయన మరో మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. 2029 జూన్‌లో రిటైర్ అయ్యే వరకు ఆయనకు పదవీ కాలం ఉంది. ఇప్పటివరకు రాజీవ్ కృష్ణ విజిలెన్స్ విభాగం డీజీగా కొనసాగుతున్నారు. గతంలో ఆయన పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను పకడ్బందీగా నిర్వహించారు. అలాగే, యాంటీ టెర్రర్ స్క్వాడ్‌కు నేతృత్వం వహించారు. దేశంలోనే అత్యధిక పోలీసులు కలిగిన రాష్ట్రం యూపీనే.


# సంపాదకీయం

## సర్‌కు సరే!

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఎన్నికల సంఘానికి కొత్తశక్తిని ఇస్తుంది. పదహారు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడోవిడత 'సర్'కు ఉపక్రమిస్తున్న తరుణంలో, జాబితాల ప్రక్షాళన విషయంలో ఎన్నికల సంఘానికి ఈ తీర్పు సర్వాధికారాలనూ దఖలుపరిచింది. ఈ ప్రక్రియను సమర్థిస్తూ వస్తున్న భారతీయ జనతాపార్టీకి ఇది సంతోషాన్నిస్తే, వ్యతిరేకించి వీధిపోరాటాలు చేసిన విపక్షాలకు పెద్ద ఎదురుదెబ్బ. బిహార్‌లో చేపట్టిన 'సర్' భేషుగ్గా ఉందని కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో ఇక దేశవ్యాప్తంగా ఆ పథకాన్ని అమలు చేయడంలో ఈసీకి ఏ అడ్డంకులూ ఉండబోవు. 'సర్' రాజ్యాంగబద్ధం, దానిని నిర్వహించే హక్కు, అధికారం ఈసీకి ఉన్నాయి, అది ఏ చట్టాలనూ అతిక్రమించలేదు, రాష్ట్రాల్లో 'సర్' నిర్వహణ ఆవశ్యకత ఉందన్న ఈసీ వాదన సమర్థనీయం, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగాలన్న రాజ్యాంగ ఆదేశాలను, ఆకాంక్షలను సర్ నెరవేరుస్తుంది అంటూ చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ ధర్మాసనం తమ నూటపాతిక పేజీల తీర్పులో నిర్ధారించింది. ఏటా జరిగే ఓటర్ జాబితా సవరణకంటే సర్ భిన్నంగా ఉన్నంతమాత్రాన దానిని వద్దనలేమని, మొదట్లో ఎక్కువమంది ఓటర్లను తొలగించినట్టుగా సర్ కనిపిస్తుంది కానీ, తగిన రక్షణచర్యలతో దీనిని రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చునని కోర్టు వ్యాఖ్యానించింది. ఆధార్, ఓటరు కార్డు తిరస్కరణ సహా అర్హత పత్రాల నిర్ణయంలో ఈసీ అధికారాలను కోర్టు పూర్తిగా సమర్థించడం విశేషం. ఎన్నికల సంఘానికి ఏవో కొన్ని నామమాత్రపు సలహాలు, సూచనలు మినహాయిస్తే, సుప్రీంకోర్టు ఈ తీర్పుతో సర్‌కు ప్రాథమికంగా చట్టబద్ధత కల్పించింది. ఓటరు జాబితాలో పేరు లేనంతమాత్రాన పౌరసత్వం కోల్పోయినట్టు కాదని కూడా ఓ భరోసా ఇచ్చింది. దేశ పౌరులు కాదన్న అనుమానంతో రెండుదశాబ్దాల నాటి ఆ జాబితాలనుంచి తొలగించిన వ్యక్తులపేర్లను నాలుగువారాల్లోగా పౌరసత్వాన్ని నిర్ధారించే యంత్రాంగానికి పంపించాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. ఓటరు జాబితాలో తీసివేతలు, చేరికలను నిర్ణయించే పరిధి మాత్రమే ఎన్నికల సంఘానిది కానీ, పౌరసత్వాన్ని మాత్రం అది నిర్ధారించలేదన్నది దీని సారాంశం. 'సర్' పేరిట పెరటిదోవన 'ఎన్‌ఆర్‌సి' అమలు అవుతోందన్న విమర్శలు, అనుమానాల నేపథ్యంలో కోర్టు ఈ జాగ్రత్త తీసుకున్నట్టు ఉంది. మరోవిధంగా చెప్పుకోవాలంటే, తనకు నచ్చినవాటిని మాత్రమే అర్హతపత్రాలుగా నిర్ణయించి, వాటి ఆధారంగా ఈ దేశ పౌరులు కాదన్న అనుమానంతో లక్షలాదిఓట్లను తొలగించడం వరకూ ఎన్నికల సంఘం ప్రక్రియ సరైనదే. కానీ, పౌరసత్వ నిర్ధారణ అధికారం మాత్రం దానికి లేదు కనుక, ఆ పని వేరే చోట జరిగి, ఒకవేళ సదరు అథారిటీ వీరిలో కొందరు ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించిన పక్షంలో, ఆ పేర్లు తిరిగి జాబితాలో చేరుతాయన్నమాట. వినడానికి ఎంతో బాగున్న ఈ ఆ దేశం ఆచరణలో కాగితాలమీద ఎంతకాలం మిగిలిపోతుందో చూడాలి. స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది వంటి మాటలు వినడానికి ఎంతో బాగుంటాయి. కానీ, ఆచరణలో ఓటరు జాబితాలనుంచి లక్షలసంఖ్యలో మాయమైపోయిన పేర్లు ఎవరివో, ఎందుకో అందరికీ తెలుసు. బిహార్‌లో నలభై లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 90లక్షల ఓట్లు ఒక్కవేటున తొలగిపోయి, ఆ తరువాత సుప్రీంకోర్టు అడపాదడపా ఇచ్చిన సూచనల మేరకు నామమాత్రంగా సాగిన ట్రిబ్యునల్స్ తరహా పరిష్కారాలతో వందల సంఖ్యలో మాత్రమే పేర్లు తిరిగి చేరిన విషయం తెలిసిందే. ముఖ్యంగా, బిహార్, బెంగాల్‌లో విపక్షపార్టీలకు ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లిం ఓటర్ల ఏరివేతే లక్ష్యంగా ఇది సాగిందన్నది ప్రధానమైన విమర్శ. కనీసం రెండుదశాబ్దాలుగా ఏ జాబితాలైతే అనేక రాష్ట్రాల్లో పాలకులను, కేంద్రంలో మూడుసార్లు ఇదే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నాయో, వాటికి మకిల వదిలించి ప్రక్షాళించే పేరిట లక్షలమంది నిరక్షరాస్యులు, నిరుపేదలను ఓటుహక్కుకు దూరం చేయడం గురించి కోర్టు సహజంగానే మాట్లాడలేదు. 'సర్' రాజ్యాంగబద్ధత గురించి కోర్టు ఏమి చెప్పబోతున్నదో దానికి వ్యతిరేకంగా పిటిషన్లు వేసిన వారికి కూడా అనుమానం ఉండివుండదు. కానీ, ఆచరణలో అత్యంత హడావుడిగా, అన్యాయంగా సాగిన ఈ ప్రక్రియ వెనుక ఉన్న దురుద్దేశాల గురించే వారి బాధంతా.

# మోదీ సర్కార్‌కు 'బొద్దింకల' బెదురు!

సర్వవ్యాపక జీవి బొద్దింక మన రాజకీయ పరిభాషలో భాగం కావడానికి చాలా కాలం ముందే అది నా పాత్రికేయ పదావళిలో ఒక భాగంగా ఉండేది. జర్నలిజంపై నా ప్రసంగాలలో నేను తరచు పాత్రికేయులను బొద్దింకలతో పోల్చుతూ ఉండేవాణ్ణి. ఎందుకు? రేపు, ప్రపంచం ఒక మహా అణ్వాయుధ దాడికి (అది సంభవించకుండా ఉండుగాక) గురైతే బతికి బయటపడే జీవి బొద్దింక ఒక్కటే కదా. మానవాళి విధ్వంసాన్ని బ్రేకింగ్ న్యూస్‌గా నివేదించేందుకు ఎవరో ఒకరు తప్పనిసరిగా అవసరమవుతారు. ఆ ఎవరో ఒకరు పాత్రికేయులు కాక మరెవరు? సమాజ సమస్యలను పరిష్కరించడంలో దేశ రాజకీయ వ్యవస్థ ఘోర వైఫల్యం పట్ల పెల్లుబుకుతోన్న ఆగ్రహావేశాలను 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆకస్మిక ఆవిర్భావం నిండుగా ప్రతిబింబించింది. పాలనను అవినీతిమయం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహరిస్తున్న భయానక అంధకారాన్ని ఎత్తిచూపేందుకు మురికి తావుల్లో నడయాడే కీటకం బొద్దింకను నిరసనకారులు ఒక ప్రతీకగా తీసుకున్నారు. పాలకులు అంతకంతకూ చక్రవర్తుల్లా ప్రవర్తిస్తున్న ఒక రాజకీయ విశ్వంలో మనం ఉన్నాం. అధికారాలను విచక్షణారహితంగా చెలాయిస్తున్న పాలకులను గట్టిగా ఎదుర్కోలేనిరీతిలో ప్రతిపక్షం చీలిపోయి ఉన్న రాజకీయ విశ్వమది. ఈ వికృత రాజకీయ విశ్వంలోకి బొద్దింక పాకుకుంటూ వచ్చింది. అసహ్యకరమైన కీటకాన్ని చిహ్నంగా స్వీకరించిన ఒక అసాధారణ వ్యంగ్య నిరసన ఉన్నపాటున ఒక ఉద్యమంగా పరిణమించింది. సుదూర అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక అజ్ఞాత రాజకీయ సందేశ వ్యూహకర్త ఈ ఉద్యమాన్ని ఆరంభించి భారతదేశ అధికార నడవాలలో ప్రకంపనలు సృష్టించాడు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన (పూర్తిగా అనవసరమైన) 'బొద్దింక' వ్యాఖ్యలు పురికొల్పిన ఆన్‌లైన్ వేలం వెర్రి ప్రపంచ అతి పెద్ద రాజకీయ పార్టీ, మహాశక్తిమంతమైన భారత రాజ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపరిచింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఒక కేసు విచారణ సందర్భంగా 'కొంతమంది యువకులు ఉద్యోగాల్లేక, చేస్తున్న పనిలో గుర్తింపు లేక బొద్దింకల్లా అన్ని చోట్లకు విస్తరిస్తున్నారు. వారు మీడియా, సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థలపై దాడి చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక డిజిటల్ తిరుగుబాటుకు దారి తీశాయి. ఆగ్రహం ఆ తిరుగుబాటును ఉసిగొల్పగా వ్యంగ్యం దానికి అసాధారణ శక్తినిచ్చింది. సీజేపీ ఒక రాజకీయ పార్టీ కూడా కాకపోవడం ఈ బొద్దింకల ఉద్యమాన్ని మరింత ఆకర్షణీయమూ, ఆసక్తిదాయకమూ చేస్తోంది. దానికొక నాయకుడు లేడు, ఇంచుమించు 150 కోట్ల ప్రజలతో అపార వైవిధ్యాలతో అలరారుతున్న దేశంలో చాలావరకు సైబర్ స్పేస్‌లోనే జరుగుతున్న ఉద్యమం యథాతథ పరిస్థితులకు ముప్పు కాబోదు. అయినా నరేంద్ర మోదీ నాయకత్వంలోని పాలనా వ్యవస్థ సీజేపీ గురించి ఎందుకు అంతగా ఆందోళన చెందుతోంది? విదేశీ నిధులతో జరుగుతున్న ఉద్యమమని సీజేపీని మోదీ ప్రభుత్వ మంత్రులు విమర్శించారు. దాని అనుయాయుల్లో చాలా మంది పాకిస్థాన్‌లో ఉన్నారని మోదీ సర్కార్ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు అవరోధాలు కల్పించారు. వాటిని తమ ఆన్‌లైన్ దాడులకు లక్ష్యంగా చేసుకున్నారు సీజేపీ వెనుక ఆమ్ ఆద్మీ పార్టీ పరోక్ష ప్రమేయమున్నదని పలువురు ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమాలలో పనిచేసినవాడు కావడమే ఆ ఆరోపణకు ఆధారం. అధికారపక్షంలో ఈ ఆందోళనకు నాలుగు కారణాలు ఉన్నాయి. మొదటిది-- తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయ కథనాల నియంత్రణపై పెద్ద ఎత్తున ఆధారపడిన ప్రభుత్వం మోదీ సర్కార్. దాని పాలన రేయింబవళ్ల వాణిజ్య ప్రచారంలా సాగుతోంది: విజయాలను ఘనంగా చెప్పుకోవడం, వైఫల్యాలను పూర్తిగా కప్పిపుచ్చడం, సరికొత్త నినాదంతో ముందుకు సాగడం. ఏటా కోటి ఉద్యోగాల సృష్టి ఒక స్వప్నంగానే మిగిలిపోయింది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావడమనేది జరగనే లేదు. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఆగనే లేదు. అయినా ప్రభుత్వ అధ్వాన పనితీరును పాలకుల కథనాలు పూర్తిగా కప్పిపుచ్చుతున్నాయి. అయితే ఇంటర్నెట్ బొద్దింకలు ఈ ప్రభుత్వ కథనాలను విశ్వసించేందుకు నిర్ద్వంద్వంగా




తిరస్కరిస్తున్నారు. ఈ తిరస్కారమే ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరుస్తోంది. రెండోది-- యువత ఆగ్రహం. ఎన్నికలలో జయాపజయాలను అది నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. జీడీపీ అంకెలు పతాక శీర్షికలవుతున్నాయి. జాతీయవాద భావోద్వేగాలు ఉధృతమవుతున్నాయి. అయినా ఒక అంతులేని అభద్రతా భావంతో నేటి తరం సతమతమవుతోంది. లక్షలాది విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. పరీక్షల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతి అస్తుబిస్తుగా ఉన్నది. యువ భారతీయులలో నెలకొన్న అసంతృప్తి నైరాశ్యంలోకి జారిపోతోంది. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు శ్రద్ధ చూపడం లేదన్నది యువత ప్రధాన ఆరోపణ. వారి ఆగ్రహం భావజాలపరమైనది మాత్రమేకాదు, పూర్తిగా వ్యక్తిగతమైనది కూడా. ఇది ఇటీవలి ఎన్నికలలో స్పష్టంగా కన్పించింది. ముఖ్యంగా తమిళనాడులో విజయ్ రాజకీయ సంచలనంలో సంప్రదాయ రాజకీయాల పట్ల యువ ఓటర్ల అసహనం పూర్తిగా ప్రతిబింబించింది. దేశవ్యాప్తంగా యువ ఓటర్లు అంతకంతకూ కాలం చెల్లిన రాజకీయ ద్వంద్వాల -- వామక్షాలు వర్సెస్ మితవాద పక్షాలు, ఉన్నత వర్గం వర్సెస్ ప్రజాకర్షక వాదం,--ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. భవితనిచ్చే నవ్యత, వాస్తవికత, భావోద్వేగ బాంధవ్యాలకోసం వారు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ ద్వారా విశాల, విస్తృత సమూహాలను సమీకరించే మీమ్ సంస్కృతి వారి నిరసనను వ్యక్తం చేసే భాషగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీకి ప్రాణవాయువుగా ఉన్న ఈ మీమ్ సంస్కృతి, బహుశా ఆ పార్టీకి సంబంధించి చాలా తక్కువగా అర్థం చేసుకున్న విషయమని విశదమవుతుంది. వ్యంగ్యం ఒక రాజకీయ ఆయుధమయింది. నిరంకుశ పాలనా వ్యవస్థలు ఆశ్చర్యకరంగా తరచు ఈ పదునైన శస్త్రాన్ని నెదుర్కోలేక ఆత్మరక్షణలో పడుతుంటాయి. ప్రతిపక్షాల ప్రసంగాలు, టెలివిజన్ చర్చలు, ఆగ్రహ సంపాదకీయాలను అవి సంబాళించుకుంటాయి. ఎందుకంటే అవి సుపరిచితమైన సమరాస్త్రాలే. అయితే పరిహాసాన్ని తట్టుకోవడం చాలా కష్టం. దానిని అణచివేయడం మరీ అసాధ్యం. ఒక పత్రికా ప్రకటన కంటే ఒక మీమ్ వడివడిగా విస్తృత ప్రభావాన్ని నెరపుతుంది. మీమ్ ది కాంతివేగం! చాలా జాగ్రత్తగా పెంపొందించుకుని పటిష్ఠం చేసుకున్న పేరు ప్రతిష్ఠలను ఒక ఎత్తి పొడుపు లేదా పరుషోక్తి ఒక క్షణంలో కూల్చివేస్తుంది. పరిహాసానికి పవిత్ర వస్తువు అనేది ఏమైనా ఉంటుందా? ఉండదు. అధికారం ఎప్పుడైతే ఎగతాళికి గురవుతుందో అప్పుడే దాని ప్రాభవ కాంతులు మసకబారడం ప్రారంభమవుతుంది. మూడోది-- సీజేపీ ఘోషించిన అంశాలన్నీ ప్రగాఢంగా ప్రతిధ్వనిస్తున్నాయి: పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగిత; ప్రశ్న పత్రాల లీక్‌లు; పాదుకుపోయిన అవినీతి; అనైతిక పార్టీ ఫిరాయింపులు; ఆప్తులు, ఆశ్రితులు, ఆస్తిపరుల ప్రయోజనాల పరిరక్షణకే పాలనా వ్యవస్థ ప్రాధాన్యమివ్వడం మొదలైనవి. ఈ 'బొద్దింకల' ఉద్యమం ఒక గందరగోళ వ్యవహారంగా కనిపించవచ్చు; అప్పుడప్పుడూ ఆదర్శాల ఆరాటం లేదా నైరాశ్యాల నిరుత్సాహంలో ఉన్న కుర్రకారు కదన కాహళిగా విన్పించవచ్చు గానీ అది అసంఖ్యాక యువత నిజమైన ఆందోళనలే ఆధార భూమికగా ఉన్న అపూర్వ ఉద్యమమది. యువతను పీడిస్తున్న వ్యాకులతలను తొలగించడంలో ఘోరంగా విఫలమైన సంప్రదాయ రాజకీయాలను నిరసిస్తున్న పెనుకేక అది. నాల్గవది-- అంతకంతకూ బలపడుతోన్న ప్రతి నిరంకుశ పాలనా వ్యవస్థ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను జాతి వ్యతిరేక చర్యగా చట్టవిరుద్ధం చేసేందుకు ప్రయత్నిస్తుంది. విమర్శను అసమ్మతిగా భావించడానికి బదులు ఒక కుట్రగా పరిగణిస్తుంది. అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ క్రమంగా కుదించుకుపోతూ చివరకు వ్యంగ్య వ్యాఖ్యలను సైతం తన మనుగడకు ముప్పుగా చూడడం ప్రారంభమవుతుంది. ఇదిగో, ఇటువంటి సందర్భాన్నే సీజేపీ సృష్టించింది. ప్రధాన స్రవంతి భావవ్యక్తీకరణ మార్గాలను మూసివేస్తే యువత అనివార్యంగా తమ అసమ్మతిని మరింత అంతరాయం కలిగించే విధ్వంసక పద్ధతులలో వ్యక్తం చేసేందుకు తప్పక పూనుకుంటారు. ఈ దృష్ట్యా, అసహన పాలనా వ్యవస్థ తనకు తానుగా సృష్టించుకున్న తిరుగుబాటు వేదికే కాక్రోచ్ జనతా పార్టీ. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ 'బొద్దింకల' ఉద్యమ ఉత్థానంలో ప్రతిపక్షానికీ ఒక హెచ్చరిక ఉన్నది. ఆగ్రహావేశాలు యువ భారతాన్ని సంపూర్ణంగా ఆవహించి ఉన్న తరుణమిది. అయితే ఆగ్రహం దానికదే ఒక రాజకీయ మార్పుగా పరిణమించదు. యువ భారతీయుల నిరాశానిస్పృహలను ఒక నిర్మాణాత్మక మార్గంలోకి మళ్లించేందుకు ప్రతిపక్షాలు వివేకవంతంగా సంఘటితమవ్వాలి. విపక్షాలు అలా ఒక వివేకశీల వేదికగా ఏర్పడనంతవరకు యువత శక్తిసామర్థ్యాలు ఒక విస్తృత ప్రజాస్వామిక ఉద్యమంగా ప్రభవించడానికి బదులు మీమ్‌లు, ఆన్‌లైన్ తిరుగుబాటులోనే చిక్కుకుపోతాయి. నేపాల్‌లో జెన్ జడ్ తిరుగుబాటుకు సమాంతరమైనదిగా సీజేపీని చూస్తున్నవారు ఒక వాస్తవాన్ని గుర్తించాలి: పట్టుమని మూడు కోట్ల మంది ప్రజలు కూడా లేని దేశంలో ఉవ్వెత్తున ఎగసిన తిరుగుబాటు తుఫాను ఇంచుమించు 150 కోట్ల జనాభాతో విస్తారంగా సామాజిక, రాజకీయ సంకీర్ణతలు పరిఢవిల్లుతోన్న భారతీయ సమాజంలో చెలరేగడం అసాధ్యం. కాక్రోచ్ జనతా పార్టీగా సంఘటితమవుతోన్న నేటి యువతకు ఒక సంస్థాగత ఉనికి, భావజాలం లేదా వనరులు లేకపోవచ్చు కానీ వారికి అసాధారణ శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. సృజనాత్మకత, ఆధిపత్య శక్తుల పట్ల గౌరవ భావ రాహిత్యం, అధికారాన్ని అపహసించే నిర్భీకత వారి సహజ సొత్తులు. బీజేపీ లాంటి శక్తిమంతమైన రాజకీయ సంస్థలు తమ సంప్రదాయ ప్రత్యర్థులను నిర్దయగా ఎదుర్కొని, అణచివేయడం పరిపాటి. అయితే స్పష్టమైన నాయకత్వం, ఒక కేంద్ర కార్యాలయం, మరీ ముఖ్యంగా కోల్పోవడానికి ఏమీలేని వికేంద్రీకృత తిరుగుబాటు ఉద్యమాలతో తలపడడమనేది ఒక కొత్త, వేరు విషయం. ఇదే మోదీ ప్రభుత్వ అసలైన బొద్దింకల సమస్య.


# బహుజనులు బాగుపడితే భరించలేరా?

ఏ ప్రభుత్వమైనా ఒక జీవో రూపొందిస్తున్నదంటే, రాష్ట్ర పురోగతిని దృష్టిలో పెట్టుకోవాలి. కానీ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 17 మాత్రం కొందరు వ్యాపారవేత్తలు, ప్రభుత్వ పెద్దల అనుచరులు, కొందరు అధికారులు కలిసి రహస్యంగా స్టార్ హోటల్‌లో కూర్చొని రూపొందించారు. ఈ జీవో వల్ల అక్షరాలా 10 వేల మంది పేద వర్గాల జీవితాలు రోడ్డున పడనున్నాయి. పేద వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను సంపదకు దూరం చేయాలన్న కుట్ర, ఈర్ష్యతో, ప్రభుత్వ అవకాశాలు అందరికీ అందకుండా, ధనికులనే మరింత ధనికులుగా మార్చడం కోసం కమీషన్ల దందాకు రెడ్ కార్పెట్ వేయడానికి, పేదలు పారిశ్రామికవేత్తలుగా ఎదగకుండా అడ్డుకోవడానికే సర్కార్ ఈ జీవోను తీసుకొచ్చింది. ఈ జీవోతో సుమారు రూ.2 వేల కోట్ల కుంభకోణానికి కుట్ర పన్నినట్టు స్పష్టమవుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, పాఠశాల విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందించేందుకు జీవో నంబర్ 17 పేరిట నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ ఇదివరకే సదరు జీవో అసంబద్ధంగా ఉందంటూ, అందులోని కొన్ని అంశాలను మార్పు చేయాలని సూచిస్తూ ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ తీర్పును ఖాతరు చేయకుండా, పేద వర్గాల అభివృద్ధికి కట్టుబడకుండా, ముఖ్యంగా స్థానికులకు అన్యాయం చేసే విధంగా అదే జీవో ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రభుత్వం ఏ లక్ష్యంతో ఉత్తర్వులు తెచ్చిందో, ఏ వర్గాల వారికి కాంట్రాక్టులు ఇవ్వాలని కోరుకున్నదో, ఎవరి జేబులు నింపుకోవాలని ముందుచూపుతో ఆలోచించి, ఎవరికి కాంట్రాక్టులు ఇస్తే కమీషన్లు వస్తాయో వారినే స్వయంగా పిలిచి స్టార్ హోటల్‌లో కూర్చోబెట్టి, వారితోనే టెండర్ నోటిఫికేషన్ నిబంధనలు తయారు చేయించి, మొదటగా రేవంత్‌రెడ్డి చేతిలోని విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువరించారో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ పెద్దలు ప్రణాళికాబద్ధంగా, కుట్రపూరితంగా పేద వర్గాలవారికి కాంట్రాక్టులు రాకుండా, సుమారు రూ.2 వేల కోట్ల కుంభకోణం చేయడానికి తెరతీశారు. అందుకోసం ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు తమ అవకాశం, వాటా కోల్పోతే ఇక ఏ ప్రాజెక్టులోనూ, ఏ కాంట్రాక్టులోనూ పేద వర్గాలకు చోటు దక్కదు. పేద వర్గాలు కనీసం టెండర్ వేయడానికి కూడా సాహసించకుండా, అప్లికేషన్ ఫీజు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు విధించారు. గత ప్రభుత్వ కాలంలో టెండర్ అప్లికేషన్ కేవలం రూ.500 లేదా రూ.1,000 లోపు పూర్తయ్యేది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, యూనిఫాం క్లాత్ టెండర్ దక్కాలంటే రూ.250 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ అయి ఉండాలి. అంతేకాకుండా రూ.5.96 కోట్ల ఈఎండీ, రూ.14.90 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయాలంటే రూ.150 కోట్ల టర్నోవర్ కావాలంట, పిల్లలకు స్కూల్ బ్యాగ్, షూ, టై, బెల్ట్ పంపిణీ చేయడానికి రూ.11.40 కోట్ల విలువైన సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలంట. ఈ నిబంధనలన్నీ ఎవరి కోసం? వీటన్నింటికీ ఎవరు అర్హులు? పేదలకు కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న కంపెనీలు ఉన్నయా? ఎవరి ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 17 తెచ్చింది? ఈ జీవో ప్రకారం, కాంట్రాక్టుల్లో మహిళ, గిరిజన సహకార సంఘాలకు అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నా, అది కేవలం కాగితాలకే పరిమితమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి పదేండ్ల పాలనలో ప్రభుత్వం గురుకులాల కాంట్రాక్టర్లను కంపెనీ టర్నోవర్, సెక్యూరిటీ డిపాజిట్ అడగలేదు. ఈఎండీలో 40 శాతం రాయితీ కల్పించారు, బ్యాంక్ సాల్వెన్సీ సర్టిఫికెట్ అడగలేదు. ప్రతి గురుకుల పాఠశాలలో కోడిగుడ్లు, కూరగాయలు, కిరాణా సామాను, చికెన్, మటన్ వంటి సరుకుల పంపిణీ కోసం పేద వర్గాలకు చెందిన వారికి అవకాశాలు కల్పించింది. సుమారు 10 వేల మంది కాంట్రాక్టర్లుగా ఆత్మగౌరవంతో నిలదొక్కుకునేలా సహకరించింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడానికే అధిక ప్రాధాన్యతనిచ్చింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలు గాలికొదిలేసి, కమీషన్ల కోసం పాకులాడుతున్నది. రాష్ట్రాన్ని, జిల్లాను యూనిట్‌గా తీసుకొని ఒక్కరికే అన్ని గురుకులాలకు సంబంధించిన కాంట్రాక్టును కట్టబెట్టాలని చూస్తున్నది. దీంతో నష్టపోయేది విద్యార్థులు, లాభపడేది కాంట్రాక్టర్లు, కమీషన్లు తీసుకొనే ప్రభుత్వ పెద్దలు. గతంలో కాంట్రాక్టర్లుగా పనిచేసిన 10 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారే. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 17 వల్ల తమకు నష్టం జరుగుతుందని, దానిని రద్దు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను, సాంఘిక సంక్షేమశాఖ మంత్రిని కలిసి విన్నవించుకున్నారు. కానీ ప్రభుత్వం పట్టించుకోకుండా టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కాంట్రాక్టర్లందరూ కలిసి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# డిప్రెషన్ అంటే కేవలం మానసిక ఆరోగ్య సమస్యనే కాదు, మెదడు పనితీరుపైనా ప్రభావం చూపిస్తుంది..



డిప్రెషన్ అనేది కేవలం మానసిక ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, అది మెదడు పనితీరుపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా డిప్రెషన్ ఎంతకాలం కొనసాగుతుందనే అంశం మెదడులో సంభవించే మార్పుల తీవ్రతను ప్రభావితం చేస్తుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ఫలితాలు భవిష్యత్తులో వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పరిశోధనలో మేజర్ డిప్రెషన్‌తో బాధపడుతున్న 46 మంది రోగుల మెదడు స్కాన్‌లను విశ్లేషించారు. పరిశోధన ఫలితాలు డిప్రెషన్ ఎపిసోడ్‌ల వ్యవధి, మెదడులోని వివిధ నాడీ నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానంలో ఉన్న మార్పుల మధ్య సంబంధం ఉందని సూచించాయి. ముఖ్యంగా రెండేళ్లకు పైగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో, ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన వారితో పోలిస్తే భిన్నమైన మెదడు కనెక్టివిటీ నమూనాలు కనిపించాయి.

**సమన్వయం దెబ్బ తినే అవకాశం..**

మెదడులోని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ నెట్‌వర్క్ (జజుచీ) నిర్ణయాలు తీసుకోవడం, లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించడం వంటి పనులకు బాధ్యత వహిస్తుంది. మరోవైపు డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ (ఐవీచీ) అనేది ఆత్మపరిశీలన, వ్యక్తిగత ఆలోచనలు, జ్ఞాపకాలతో సంబంధం కలిగి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ రెండు నెట్‌వర్క్‌లు సమతుల్యంగా పనిచేస్తాయి. అయితే డిప్రెషన్ ఉన్నవారిలో ఈ సమన్వయం దెబ్బతినే అవకాశం ఉందని అధ్యయనం వెల్లడించింది. ఈ అసమతుల్యత కారణంగా వ్యక్తులు ప్రతికూల ఆలోచనల్లో చిక్కుకుపోవడం, పదేపదే అదే విషయాలను ఆలోచించడం, అవసరమైన సమయంలో పరిసరాలపై దృష్టి సారించడంలో ఇబ్బంది పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు. డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.

**డిప్రెషన్‌తో నెగెటివ్ ప్రభావం..**

అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన రోగుల్లో లక్షణాలు తీవ్రమవుతున్న కొద్దీ జజుచీ, ఐవీచీ మధ్య అనుసంధానం తగ్గుతున్నట్లు గుర్తించారు. అయితే చాలా కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. వారిలో డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ రెండు నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం మరింత బలపడుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ఫలితాలు డిప్రెషన్ కారణంగా మెదడులో జరిగే మార్పులు కాలక్రమేణా అభివృద్ధి చెందుతాయని సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో కొన్ని నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం తగ్గిపోతుంది. అయితే వ్యాధి ఎక్కువకాలం కొనసాగినప్పుడు లేదా పదేపదే తిరిగి వచ్చినప్పుడు మెదడు పనితీరులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. డిప్రెషన్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఎంత ముఖ్యమో ఈ పరిశోధన మరోసారి స్పష్టం చేసింది. మెదడులోని మార్పులను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ప్రతి వ్యక్తి పరిస్థితికి అనుగుణంగా మరింత సమర్థవంతమైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వేసవి కాలంలో రోజంతా బయట పనిచేసేవారు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

వేసవి కాలం బయట పని చేసే కార్మికులకు ఒక పెద్ద సవాల్ లాంటిదని చెప్పవచ్చు. నిర్మాణ కార్మికులు, రోడ్డు పని చేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, రోజువారీ కూలీలు వంటి వారు మండే ఎండలో గంటల తరబడి పనిచేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఆహారం కేవలం ఆకలి తీర్చడానికే కాదు, శరీరానికి శక్తిని అందించడానికి, నీటి లోపాన్ని తగ్గించడానికి, అలసటను ఎదుర్కోవడానికి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఎండలో పని చేసే కార్మికులు వేసవికాలంలో ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా, శరీరానికి చల్లదనాన్ని అందించి తీవ్రమైన వేడిని తట్టుకునే శక్తిని ఇస్తాయి. వేసవిలో కార్మికులు భోజనంలో పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆకలి తగ్గినప్పుడు కూడా పెరుగును సులభంగా తినగలుగుతారు. చాలామంది పెరుగును అన్నంతో కలిపి లేదా రోటీతోపాటు తీసుకుంటారు. ఇది శరీరానికి ఉపశమనం కలిగించడంతోపాటు తేలికైన పోషణను అందిస్తుంది.

**పెరుగు, మజ్జిగ, కూరగాయలు..**

పెరుగుతోపాటు మజ్జిగను కూడా కార్మికులు వేసవి ఆహారంలో ముఖ్యమైన భాగంగా చేసుకోవాలి. రోజంతా చెమటలు పట్టే పనులు చేసే వారికి మజ్జిగ దాహాన్ని తగ్గించి శరీరాన్ని తాజాగా ఉంచుతుంది. జీలకర్ర పొడి, ఉప్పు లేదా పుదీనాతో తయారు చేసే మజ్జిగ మరింత రుచికరంగా ఉండటంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్కువ సమయంలో తాగగలిగే ఈ పానీయం ఎండలో పనిచేసే వారికి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. అధిక మసాలాలు, నూనెతో చేసిన ఆహారం వేసవిలో భారంగా అనిపిస్తుంది. కనుక పెరుగన్నం, పప్పన్నం లేదా తేలికపాటి ఖిచిడీ వంటి ఆహారాలను ఎంచుకోవాలి. ఇవి కడుపుని నింపడంతోపాటు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అన్నం త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, దోసకాయ, నిమ్మకాయ, టమాటా వంటి ముడి కూరగాయలు కూడా వేసవిలో కార్మికుల భోజనంలో తరచూ కనిపిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. ముఖ్యంగా దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, ఉప్పుతో కలిసి తింటే భోజనానికి రుచి పెరగడంతోపాటు వేడి ప్రభావాన్ని కూడా కొంత మేర తగ్గిస్తుంది.



**కొబ్బరినీళ్లు, పండ్లు..**

అవకాశం ఉన్నప్పుడు కొబ్బరి నీరు, సీజనల్ పండ్లు కూడా కార్మికులు ఆహారంలో భాగంగా తీసుకోవాలి. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేయడంలో సహాయపడుతాయి. పుచ్చకాయ, తర్బూజా వంటి పండ్లు అధిక నీటి శాతంతో ఉండటంతో వేసవిలో శరీరానికి చల్లదనం అందిస్తాయి. మామిడి పండ్లు కూడా శక్తినిస్తాయి కానీ ఎక్కువగా తీసుకుంటే భారంగా అనిపించే అవకాశం ఉంటుంది కనుక మితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది కార్మికులు ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లే రోటీలు, కూరలపై ఆధారపడతారు. కనుక సొరకాయ, బీరకాయ, గుమ్మడికాయ, ఆలుగడ్డ వంటి సీజనల్ కూరగాయలతో చేసిన సాధారణ కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి ఎక్కువసేపు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణక్రియకు కూడా అనుకూలంగా ఉంటాయి. తక్కువ నూనె, కొద్దిపాటి ఉప్పుతో తయారుచేసే ఈ భోజనం శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.

**సత్తు పానీయం..**

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో సత్తు వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన ఆహారాల్లో ఒకటి. నీటిలో సత్తు, నిమ్మరసం, ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది ఒకేసారి దాహాన్ని తీర్చడమే కాకుండా పొట్టని కూడా నింపుతుంది. అలాగే అటుకులు వంటి తేలికపాటి ధాన్యాలతో తయారుచేసిన ఆహారాలు కూడా సులభంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి.వేసవిలో కార్మికులు ఈ సంప్రదాయ ఆహారాలు తీసుకోవడం ద్వారా కేవలం ఆకలి తీరడమే కాదు, మండే ఎండను ఎదుర్కొనే శక్తిని అందించే సహజ రక్షణ కవచాలుగా కూడా పనిచేస్తాయి. తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే ఈ ఆహారాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు

# రాత్రి భోజనం చేశాక కాసేపు నడిస్తే ఎన్నో లాభాలు.. రోజూ చేయాలంటున్న వైద్యులు..



భోజనం చేసిన వెంటనే కొద్దిసేపు నడవడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఫార్ట్ వాక్స్ పేరుతో వైరల్ అవుతోంది. అయితే ఇది కొత్త అలవాటు కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత స్వల్పంగా నడవడం జీర్ణక్రియకు చాలా కాలంగా సూచిస్తున్న సరళమైన అలవాట్లలో ఒకటని వివరిస్తున్నారు. ఈ చిన్న నడక కేవలం ఆహారం జీర్ణం కావడానికే కాదు, కడుపులో గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణాశయ ఆరోగ్య నిపుణుల ప్రకారం భోజనం చేసిన తర్వాత 5 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చుట్టూ, ఆఫీస్‌లో, ట్రెడ్‌మిల్‌పై లేదా బయట వీధిలో నెమ్మదిగా నడిచినా సరిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో కఠినమైన వ్యాయామం చేయకుండా సాదాసీదా నడక మాత్రమే చేయాలని సూచిస్తున్నారు.

**గ్యాస్ బయటకు వెళ్తుంది..**

భోజనం తర్వాత నడక వల్ల ఆహారం పేగుల్లో సులభంగా కదలడంలో సహాయం జరుగుతుంది. దీని వల్ల కడుపులో చిక్కుకుపోయిన గ్యాస్ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండి ఉబ్బరం తగ్గుతుంది. అలాగే పేగుల కదలికలు మెరుగుపడి మల విసర్జన సులభమవుతుంది. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారికి కూడా ఈ అలవాటు కొంత ఉపశమనం ఇస్తుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం లేదా కూర్చోవడం కంటే కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అసౌకర్యం తగ్గుతుంది. ఈ అలవాటులో ప్రత్యేకమైన పరికరాలు, ఖరీదైన ఫిట్‌నెస్ సామగ్రి అవసరం లేదు. ఎవరైనా సులభంగా రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి భోజనం తర్వాత చిన్న నడక శరీరానికి చలనం కలిగించి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**ఎలా నడవాలి..**

ఫార్ట్ వాక్స్ చేయాలంటే ముందుగా భోజనం పూర్తి చేసిన తర్వాత కొద్దిసేపు ఆగాలి. ఆ తర్వాత నెమ్మదిగా, ఒత్తిడి లేకుండా నడవాలి. వేగంగా పరుగులు తీయడం లేదా గట్టిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. రోజూ రాత్రి భోజనం తర్వాత ఇలా కొద్దిసేపు నడిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. సాధారణంగా కనిపించే ఈ అలవాటు దీర్ఘకాలంలో మంచి ఆరోగ్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరచూ ఎదురయ్యే వారు ఈ అలవాటును ప్రయత్నించవచ్చు.

# కాప్రా డివిజన్‌లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,మే 31(సూర్యరేఖ)** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాప్రా,వంపుగూడ డివిజన్‌లో సుమారు రూ.4కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు,డ్రైనేజీలు,పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతికాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రారంభించిన అభివృద్ధి పనులు సీనియర్ సిటిజన్ కాలనీ యుజిడి(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ)పనులు రూ.40 లక్షలు,సాకేత్ కాలనీలో ఓపెన్ జిమ్ మరియు చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు రూ.25 లక్షలు,వోర్లా ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు రూ.60 లక్షలు,కాప్రా నాలా నుండి సాయిసుమాటీ-జంక్షన్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు రూ.2.50 కోట్లు, గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలు మొత్తంగా సుమారు రూ.4 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కాప్రా డివిజన్‌లో మౌలిక వసతులు మరింత మెరుగుపడి,ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బైరి నవీన్ గౌడ్,కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉన్నత విద్యపై అవగాహన సదస్సు.. టెన్త్ క్లాస్ మెరిట్ విద్యార్థులకు సన్మానం





**ఉప్పల్,మే31(సూర్యరేఖ):**ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రామంతపూర్ లోని 15 స్కూళ్లకు సంబంధించిన టెన్త్ క్లాస్ టాపర్స్ ఫస్ట్,సెకండ్,థర్డ్ ర్యాంకులు పొందిన విద్యార్థులకు సన్మానం,ఉన్నత విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రవణ్ కుమార్ పీహెచ్డీ న్యూఎరా కాలేజ్ డైరెక్టర్ విద్యార్థులను సన్మానించారు.అనంతరం డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ...ఉన్నత విద్య అభ్యసించుటకు, మనం భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,జీవితంలో మన లక్ష్యం చేరుకోవాలంటే నిర్ణయించుకునే సమయం ఇదే,విద్యార్థులు ఏమి చదువుకోవాలో వారే నిర్ణయించుకోవాలి,మన గోల్ రీచ్ కావాలంటే మంచి స్నేహితులను ఎంచుకోవాలి, చదువుకునేటప్పుడు వచ్చిన సందేహాన్ని వెంటనే తీర్చుకోవడానికి ప్రయత్నించాలి,దొరికిన సమయాన్ని బుక్స్ చదవడం కానీ,ఫోన్ ద్వారా కానీ అనేక విషయాలు తెలుసుకోవాలి,మనం ఉన్నత స్థాయిలో ఉండాలంటే మంచి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలి,అంతేకాకుండా మీరు ఎవరైనా టాపర్స్ చదువుకున్న వాళ్ళు ఉంటే ఇంటర్మీడియట్ ఫ్రీగా అడ్మిషన్ ఇస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్ సుకన్య,అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్,టి.రవీందర్రావు,రఘు ప్రకాష్,జిల్లా కిరణ్ కుమార్,సిద్ధగొని రాజు,గోలి కృష్ణయ్య,సురేష్ గుప్తా,కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక సమస్యలకు టెలి మానస్ భరోసా

హెల్ప్ లైన్14416

24 గంటలు సేవలు..

టెలిమానస్ సూపర్వైజర్,ప్రముఖ సైక్రియాటిస్ట్ జవహర్లాల్ నెహ్రూ



**రాజేంద్రనగర్,మే31(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి భరోసా ఇవ్వడానికి టెలి మానస్ పేరిట హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసినట్లు నేషనల్ హెల్త్ మిషన్ అధికారి ప్రముఖ సైకాలజిస్ట్ పాతనేని వెల్లడించారు.మానసిక సమస్యలపై సలహాలు కావాలనుకున్న వారు,స్వాంతన పొందాలనుకున్నవారు తమ హెల్ప్ లైన్14416 నెంబర్ పై ఎప్పుడైనా సంప్రదించవచ్చని ఆయన సూచించారు.అహం సూత్ర సోషల్ ల్యాబ్,స్పార్క్ కమ్యూనిటీ హెల్త్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పెద్ద తాళ్లకుంట పార్కులో సామాజిక కార్యకర్త జర్నలిస్టు మధు ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై జరిగిన కార్నర్ మీటింగ్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.సమాజంలో రోజురోజుకు మానసిక సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం కింద ప్రతి రాష్ట్రంలో టెలి మానస్ హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసిందని హెల్ప్ లైన్ సూపర్వైజర్ సైకాలజిస్ట్ జవహర్లాల్ నెహ్రూ తెలిపారు.దీనికోసం14416 నెంబర్ తో హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశామని,ఈ హెల్ప్ లైన్ సెంటర్ 24గంటలు పనిచేస్తుందని వివరించారు.వాస్తవానికి సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాల విపరీత వినియోగం వల్ల మానసిక సమస్యలతో పాటు ఇతర సామాజిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.స్మార్ట్ ఫోన్లను కానీ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కానీ మన అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు. విపరీతమైన వాడకం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయో ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక విశ్లేషకులు ప్రొఫెసర్ కనకయ్య,మల్లికార్జున్ రెడ్డి,పెద్ద తాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య,దుర్గా దాస్,అహం సూత్ర సోషల్ ల్యాబ్ వ్యవస్థాపకులు రాచూరి అజిత్,సామాజిక కార్యకర్త జర్నలిస్టు మధు తదితరులు పాల్గొన్నారు.



## 13మంది విద్యార్థుల ఎంపిక..

**కామారెడ్డి,మే31(సూర్యరేఖ)** శనివారం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ వారు వెలువర్చిన ఎంపిక జాబితాలో తెలంగాణ ఆదర్శ పాఠశాల సదాశివ నగర్ కు చెందిన 13మంది విద్యార్థులు ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థుల పేర్లు ఆకుల సంజన,ఆకుల నాయనాశ్రీ,స్మితాశ్రీ,భార్గవి,భవిష్య చౌహన్,ప్రణీతి ప్రణవి,డి.సంజన, ఏ.భరత్, బాలాజీ, భైరవరెడ్డి,కే.సాత్విక,ఎం.నవీన్ ఎంపికైన విద్యార్థులందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. రాజారెడ్డి ఉపాధ్యాయ బృందం గ్రామ సర్పంచ్ వంకాయల శిరీష రవి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కీర్తన మరియు సభ్యులు గ్రామ పెద్దలు తల్లిదండ్రులు అభినందించడం జరిగింది.

## ఉప్పల్ వినాయక్ నగర్‌లో రూ.60 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు..

పనులను పరిశీలించిన ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,మే31(సూర్యరేఖ)**ఉప్పల్ డివిజన్ వినాయక్ నగర్‌లో రూ.60 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆదివారం ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.ఇటీవల కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులు చేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.మొత్తం రూ.60లక్షలతో డ్రైనేజీ, నిర్మాణం పనులు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... కాలనీవాసులతో కలిసి పనులను పరిశీలించాం.. వర్షాకాలం లోపు డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నాం. .త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం వినాయక్ నగర్‌ను ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతాం”అని తెలిపారు.ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం .. అభివృద్ధే మా లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్,బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి,అలుగుల అనీల్ కుమార్,తోకట రాజు, కంచర్ల శ్రీను,నాగరాజు, కుందానపల్లి బాలరాజు,కుందానపల్లి రాజు, సింగారం వెంకటేష్,కుందానపల్లి భాగ్య,సింగారం అండాలు, మామిళ్ళ పుష్ప,మామిళ్ళ మధు, కుండానపల్లి నరేందర్,యాకరి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ జ్యోతి మనోహర్ పాటిల్




**నాగల్ గిద్ద,మే31(సూర్యరేఖ)** జొన్నలు సాగు చేసిన రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా జొన్నల కేంద్రానికి తరలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు రైతులు మద్దతు పొంది సద్వినియోగం చేసుకోవాలని నాగలిగిద్ద మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ జ్యోతి మనోహర్ పటేల్ అన్నారు ఆదివారం మండల పరిధిలోని సక్రు తాండల్లో రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంజరెడ్డి,మావినెల్లి గ్రామ ఉపసర్పంచ్ గణపతి రావు,మాజీ జెడ్పీటిసి రూప్సింగ్,మాజీ సర్పంచులు దేవారెడ్డి మనోహర్ పటేల్,నాయకులు సంజీవ్ పటేల్,రైతులు,కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్..

గ్రామాభివృద్ధి,ప్రజాసేవే తమ ప్రధాన లక్ష్యం..

లక్ష్మతండా సర్పంచ్ బానోతు కర్ణనాయక్



**మరిపెడ, మే31(సూర్యరేఖ)** పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయనిధి అని లక్ష్మతండా సర్పంచ్ బానోతు కర్ణనాయక్ అన్నారు. ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ సహకారంతో మంజూరైన మరిపెడ మండలం లక్ష్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జామ్లాతండాకు చెందిన బానోతు మల్సూర్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కర్ణ మాట్లాడుతూ...తెలంగాణ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజ నాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.గ్రామాభివృద్ధి,ప్రజాసేవే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పేదలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీఎం సహాయ నిధి చెక్కులు అందించినట్లు తెలిపారు.సీఎంఆర్ఎఫ్ సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి,ప్రభుత్వ విప్ ,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ కు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోత్ పాపలాల్ పంతులు,కాంగ్రెస్ నాయకులు వీరన్న,సిరి భావుసింగ్,అర్జున్ నాయక్,తదితరులు పాల్గొన్నారు

# విజయవంతంగా ముగిసిన ఉప్పల్ జోనల్ సమ్మర్ క్యాంప్ ముగింపు..






ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్

**ఉప్పల్,మే31(సూర్యరేఖ)** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్-2026ఆదివారం ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ లో ఘనంగా ముగిసింది.ఉప్పల్ జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో 78కేంద్రాల్లో 12క్రీడా విభాగాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించగా,వందలాది మంది వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.యువ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ పరిశీలించిన ఆయన, విద్యార్థులను అభినందిస్తూ వారి క్రమశిక్షణ, ప్రతిభను కొనియాడారు.అనంతరం ప్రతిభకనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ...చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపొందింపుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గతంలో ప్రతి పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానాలు,ప్రత్యేక పీఈటీ ఉపాధ్యాయులు ఉండేవారని,ప్రస్తుతం చాలా పాఠశాలలు పరిమిత స్థలంలోనే కొనసాగుతున్న కారణంగా విద్యార్థులకు క్రీడలకు తగిన అవకాశాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి పరిస్థితుల్లో విద్యార్థులు ఎక్కువగా భవనాలకే పరిమితమైపోతున్నారని,క్రీడల కోసం తగిన స్థలం కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొందని అన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న క్రీడా శిక్షణా శిబిరాలు,సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇలాంటి కార్యక్రమా లు విద్యార్థుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొం దించి, దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే క్రీడాకారులను తయారు చేస్తాయని పేర్కొన్నారు.ఉప్పల్ ప్రాంతం నుంచి రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. క్యాంప్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేయగా, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు ప్రదానం చేశారు.క్యాంప్ విజయవంతానికి కృషి చేసిన కోచ్లు,శిక్షకులను ప్రత్యేకంగా సన్మానించి వారి సేవలను గుర్తించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి,ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా,సూపరింటెండింగ్ ఇంజినీర్ హరికిశోర్, డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ,డీఈ.ఈ.వినీల్ గౌడ్, ఎ.ఈ.రాజ్ కుమార్, ఇన్చార్జ్ గేమ్స్ ఇన్స్పెక్టర్ బి.ఎం. విఘ్నేశ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# పెరిక సంఘం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం..






**కామారెడ్డి,మే31(సూర్యరేఖ)** ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన పెరికకుల సంఘం జిల్లా అధ్యక్షులు పోతరాజు వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా పెరిక కులం కామారెడ్డి జిల్లాకు చెందిన పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్, ఏపీసెట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పెరిక సంఘం రాష్ట్ర మరియు జిల్లా నాయకులు సన్మానం కార్యక్రమం నిర్వహించారు.శాలువా మెమెంటోలతో ఘనంగా సన్మానించడం జరిగింది.మరియు వెయ్యి రూపాయలు నగదు బహుమతి అందించడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతోపాటు ఆటలు మరియు ఇతర రంగాల్లో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మరియు సమాజానికి ఉపయోగపడేలా మంచి స్థానంలో ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా ముత్తినేని వీరయ్య,వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్,లక్కర్స్ ప్రభాకర్ వర్మ,పెరిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు,నిజామాబాద్ జిల్లా పెరుక సంఘం అధ్యక్షుడు మైదం రాజన్న,జిల్లా సాంస్కృతిక విభాగ కన్వీనర్ బాలప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్ల భాస్కర్,ముఖ్య సలహాదారు మర్రి శేఖర్,జిల్లా ప్రచార కార్యదర్శి నరెడ్ల లింగం,ఉపాధ్యక్షులు నల్లపు రమేష్,ముఖ్య సలహాదారు భూసాని సత్యనారాయణ,దోమకొండ మాజీ ఎంపిటిసి నల్లపు శ్రీనివాస్,దోమకొండ మాజీ ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు,పెద్ద చక్కెరగా గ్రామ వార్డు సభ్యురాలు సురేఖ,కామారెడ్డి పట్టణ పెరిక సంఘ అధ్యక్షులు మద్ద మల్లేశం,మరియు సంఘం నాయకులు బసవలింగం,గంగరాజు చక్రపాణి కిష్టయ్య రాజు తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## మన్కీబాత్ 134వ ఎపిసోడ్ తిలకించిన దేవర శ్రీనివాస్ బృందం..




**నాంపల్లి,హైదరాబాద్,మే31(సూర్యరేఖ)** దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 134వ ఎపిసోడ్ బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాస్ పార్టీ శ్రేణులతో కలసి కార్వాన్ లోని నివాస కార్యాలయంలో తిలకించారు.దీని ద్వారా ఆయన దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ వివిధ అంశాలు, విజయాలు,సామాజిక సమస్యల గురించి తన ఆలోచనలు మాన్ కి బాత్ లో పంచుకున్నారు.ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ.. .క్రీడాకారుల ప్రశంసలు,అంతర్జాతీయ వేదికలపై రాణిస్తున్న భారతీయ క్రీడాకారుల ప్రతిభను మరియు యువత చూపిస్తున్న ఆసక్తిని ప్రధాని మన్కీ బాత్ లో ప్రత్యేకంగా కొనియాడారు.ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,శరీరం డీహైడ్రేషన్కు గురికాకుండా నిరంతరం నీళు తాగుతూ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని తెలిపారు.ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, ఎండలోకి వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు ప్రభుత్వ శాఖలు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. ఇదే సమయంలో వేసవి కాలంలో అందరికీ ఇష్టమైన ఫలరాజం మామిడి పండ్ల గురించి ప్రధాని ఆసక్తికరంగా ప్రస్తావించారు.దేశంలో మామిడి ముచ్చట లేని ఇల్లే ఉండదని,ప్రాంతాన్ని బట్టి రంగు, రుచి,సువాసనలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు.మహారాష్ట్రకు చెందిన ఆల్ఫాన్సో,గుజరాత్ కేసర్,ఉత్తరప్రదేశ్ దసహరి,కాశీ లంగ్డా,బిహార్,కు చెందిన చౌసా,మాల్దాలతో పాటు దక్షిణాదిలో లభించే బంగినపల్లి,తోటపురి, నీలం,మల్గోవా,బెంగాల్ హిమ్సాగర్, ఒడిశా ,ఆంధ్రప్రదేశ్లలో పండే సువర్ణరేఖ వంటి ఎన్నో రకాల మామిడి పండ్లతో ప్రజలకు ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయని మోదీ అన్నారు. గ్రామాల్లో పండే ఈ దేశీయ మామిడి రకాలు ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్కు సైతం చేరుకుంటున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీవిరాట్ విశ్వకర్మ స్వర్ణకార కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం..

ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,మే31(సూర్యరేఖ)** రామంతాపూర్ లో నూతనంగా ఏర్పాటైన జై శ్రీవిరాట్ విశ్వకర్మ స్వర్ణకారవ్యవస్థాపక అధ్యక్ష, కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవము రామంతాపూర్ లోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ఘనంగా జరిగింది.ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి,తెలంగాణ విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం చైర్మన్ లాలుకోట వెంకటాచారి,తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు మదన్మోహన్,తెలంగాణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి,నూతనంగా కార్యవర్గ సంఘం అధ్యక్షులు కనపర్తి రామరత్నం,ప్రధాన కార్యదర్శి పెరిగేటి సుధాకర్,కోశాధికారి కందుకూరి సోమేశ్వర చారి,కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షులు పూనా సత్యనారాయణచారి,కోటి శశిధర్,మారోజు నవీన్ చారి,అమరవాది వేణుగోపాల్,సంయుక్త కార్యదర్శి ములకాల నవీన్,కొమ్మోజు ఆనంద్,రాష్ట్ర శిలాశిల్పి సంఘం అధ్యక్షులు శిల్పి శశిధర్,డాక్టర్ బి.విచారి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి,మాజీ లీడర్ కంది ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

## రెండు రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న475 మందిపై కేసులు..




**నాంపల్లి,హైదరాబాద్,మే31(సూర్యరేఖ)** హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతను పెంపొం దించడమే లక్ష్యంగా నగరవ్యాప్తంగా వారాంతపు రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ నెల29,30 తేదీలలో చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్లో,మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 475మంది డ్రైవర్లు పట్టుబడ్డారని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.జోయల్ డేవిస్,ఐపిఎస్ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టుపడిన వాటిలో ద్విచక్ర వాహనాలు 397,త్రిచక్ర వాహనాలు 36,నాలుగు చక్రాల వాహనాలు 42,ఇతర వాహనాలు పట్టుబడాయి.మద్యం సేవించిన పరిమాణం ఆధారంగా నమోదైన కేసుల వివరాలు 30నుంచి 50శాతం మధ్య 90కేసులు, 51నుంచి100 శాతం మధ్య 202 కేసులు,101నుంచి 150శాతంమధ్య 96కేసులు,151నుంచి 200శాతంమధ్య 43కేసుల, 201నుంచి 250శాతంమధ్య 24 కేసులు, 251నుంచి300 శాతంమధ్య11 కేసులు,300 అంతకంటే ఎక్కువ శాతం 09కేసులు నమోదు కావడం నమోదు జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్,ఐపిఎస్ మాట్లాడుతూ...మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల మరియు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు,నగర ప్రజలు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

## మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు




**బండ్లగూడ,మే31(సూర్యరేఖ)** మన్ కీ బాత్ కార్యక్రమంతో దేశ వ్యాప్తంగా ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దగ్గర అవుతున్నారని బిజెపి జనరల్ సెక్రటరీ నీరుడు పవన్ సాయి అన్నారు.మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బిజెపి జనరల్ సెక్రటరీ నీరుడు పవన్ సాయి154వ బూత్ అధ్యక్షులు ఉదయ్ గౌడ్,బిజెపి కార్యకర్త వినయ్ తో కలిసి వీక్షించారు.ఈ కార్యక్రమం ద్వారా మోదీ దేశాభివృద్ధి,సామాజిక బాధ్యతల పట్ల పంచుకున్న ఆలోచనలు ప్రతి భారతీయుడికి మార్గదర్శకంగా నిలుస్తాయి.దేశ ప్రగతిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం మరోసారి బలంగా చాటిచెప్పిందని వ్యాఖ్యానించారు.

# బ్రతికుండగానే చనిపోయినట్లు నమోదు..!

పింఛన్ కోసం తిరిగితే 'మరణించింది'అంటూ షాక్

**ఖమ్మం,మే31(సూర్యరేఖ)** రఘునాథపాలెం మండలంలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది.బ్రతికుండగానే ఇద్దరు వ్యక్తులను మరణించిన వారిగా ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేయడంతో వారు పింఛన్లు, రేషన్ బియ్యం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి దూరమయ్యారు. మండలంలోని కొండ్రు రాములమ్మ భర్త రెండు సంవత్సరాల క్రితం మరణించడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసింది.అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పింఛన్ మంజూరు కాలేదు. ఇటీవల కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలించగా, రాములమ్మను మరణించిన వ్యక్తిగా నమోదు చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా ఎలాంటి దరఖాస్తు లేకుండానే ఆమె పేరుపై డెత్ సర్టిఫికెట్ జారీ అయినట్లు తెలిసి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు."నేను చనిపోలేదు..బ్రతికే ఉన్నాను"అంటూ రాములమ్మ అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమవడం స్థానికులను కలిచివేసింది. ఈ తప్పిదం కారణంగా ఆమెకు పింఛన్‌తో పాటు రేషన్ బియ్యం కూడా నిలిచిపోయాయి.అదే గ్రామానికి చెందిన కొమ్ము పుల్లయ్య పరిస్థితి కూడా ఇలాగే ఉంది.ఐదు సంవత్సరాల క్రితం భార్య పుల్లమ్మ మరణించగా,అధికారులు పొరపాటున పుల్లయ్యనే మరణించినట్లుగా నమోదు చేశారు. దీంతో ఆయన కూడా పింఛన్‌కు దూరమయ్యాడు.ఒకే గ్రామంలో ఇద్దరు జీవించి ఉన్న వ్యక్తులను మరణించిన వారిగా నమోదు చేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పింఛన్ దరఖాస్తులను సక్రమంగా పరిశీలించకపోవడం, ఆన్‌లైన్



నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు.ఈ ఘటనపై స్పందించాలని ఎంపీడీవో అశోక్‌ను సంప్రదించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన స్పందించలేదు.బాధితులకు వెంటనే న్యాయం చేయాలని,రికార్డులను సరిదిద్ది పింఛన్లు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.అలాగే ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం..వైద్యుల నిర్లక్ష్యంతో వికలాంగుడైన ఏడు నెలల పసికందు

**ఖమ్మం,మే31(సూర్యరేఖ)**ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఏడు నెలల పసికందు వికలాంగుడిగా మారిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన తలపాటి సూర్యకాంత్ భార్య రేణుక ఏడు నెలల గర్భిణీగా ఉన్న సమయంలో కవల పిల్లలకు జన్మనిచ్చింది.కవల పిల్లల్లో ఒక బాలుడి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఈ ఏడాది మార్చి4న ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.బాలుడికి రక్తం తక్కువగా ఉందని వైద్యులు రక్తం ఎక్కించారు.అయితే కాన్యులా అమర్చిన ప్రదేశంలో వాపు రావడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు వైద్యులకు తెలియజేసినా,పెద్ద సమస్యేమీ కాదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు.రోజులు గడిచినా వాపు తగ్గకపోవడం,చేయి నల్లగా మారడంతో మరోసారి వైద్యులను ప్రశ్నించగా,ప్రైవేట్‌లో స్కానింగ్ చేయించుకుని రావాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం తీసిన స్కానింగ్ రిపోర్టులో చేతి కణజాలం తీవ్రంగా దెబ్బతిన్నట్లు తేలడంతో బాలుడి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.దీంతో వైద్యులను నిలదీయగా హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళితే చికిత్స ద్వారా నయం అవుతుందని చెప్పడంతో మార్చి 26న బాలుడిని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.అక్కడి వైద్యులు బాలుడి చేయి పూర్తిగా దెబ్బతిన్నదని



,ప్రాణాపాయం నివారించేందుకు చేతిని తొలగించడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు.చివరకు భారమైన మనసుతో తల్లిదండ్రులు శస్త్రచికిత్సకు అంగీకరించగా,బాలుడి చేతిని తొలగించారు.ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు జీవితాంతం వికలాంగుడిగా మారాడని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం ప్రభుత్వాన్ని కోరుతోంది

# కల్లూరు ప్రభుత్వ పాఠశాలల ఆణిముత్యాలు







2025-26 విద్యా సంవత్సరంలో సత్తా చాటిన కుసుమాలు

**ఖమ్మం,మే31(సూర్యరేఖ):**కల్లూరు మండల విద్యార్థులు త్రిబుల్ ఐటీ బాసర వారు ప్రకటించి నటువంటి అర్హత మరియు సీట్లు పొందడం జరిగినది.ఐదుగురు విద్యార్థులు ఖమ్మం జిల్లాలోని అత్యధికంగా సీట్లు సాధించి కల్లూరు మండల విద్యారంగం ప్రథమంలో నిలవడం జరిగినది జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుండి ముగ్గురు ఆర్.శివ నందిని,ఎస్కే ఫరీదా,కే. జోస్తవిక,విద్యార్థులు పీఎం గౌట్ హై స్కూల్ నుండి ఒక విద్యార్థి మోదుగు రామచరణ్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఒక విద్యార్థిని సాయి వెన్నెల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న కోరుకొండ నుండి ఇంటి త్రిష,కల్లూరు మండల విద్యాశాఖ అధికారిని పత్తిపాటి నివేదిత ,ప్రధానోపాధ్యాయులు పద్మ, రమణయ్య శ్రీనివాసరావు,అన్ని పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు వారి తల్లిదండ్రులు కల్లూరు మండలం లో ఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆశీర్వదించారు.









## భవన నిర్మాణ కార్మికులందరూ గుర్తింపు కార్డులు పొందండి..

సిపిఐ నాయకులు యాదగిరి నర్రగిరి పిలుపు



**శంషాబాద్,మే31(సూర్యరేఖ)** భవన నిర్మాణ కార్మికుల అందరూ గుర్తింపు కార్డులు పొంది ప్రమాద బీమా అవకాశాలను పొందాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి శంషాబాద్ మండల కార్యదర్శి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి కార్మికులకు పిలుపునిచ్చారు.ఆదివారం సిపిఐ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డుల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఏఐటీయూసీ సిపిఐ పార్టీ పోరాటాల ఫలితంగా లేబర్ బోర్డు ఏర్పడిందని ఆబోర్డులో వేలకోట్ల రూపాయలు సేస్సు రూపంలో జమ అయ్యాయని వారు తెలిపారు.వాటిని కార్మికుల అభివృద్ధికి ఉపయోగించాలని చట్టం చెబుచున్న కార్మికులు ఎవరు వాడుకోవడం లేదని వారు తెలిపారు.ఏఐటియుసి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు అందే విధంగా చూస్తుందని కార్మికులందరూ ఏఐటియుసిని సంప్రదించాలని వారు కోరారు.లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.రూ.ఐదు రూపాయల భోజనం మంచినీటి వసతి బాత్రూంలో వంటి మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించే విధంగా ప్రభుత్వం చూడాలని వారు డిమాండ్ చేశారు.ఈ గుర్తింపు కార్డుల సదస్సు కార్యక్రమంలో మండల కార్యదర్శి గిలకరాజు నరేష్ నాయక్,భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## అత్త,భర్త వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

**రాజేంద్రనగర్,మే31(సూర్యరేఖ)**



అత్త,భర్త వేధింపులు భరించలేక గృహిణి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. రాజేంద్రనగర్ మాణి క్యమ్మకాలనీలో నివాసముండే భవానీ(26) 2025లో శ్రీకాంత్ తో ప్రేమ వివాహం జరిగింది.తర్వాత ఆమె అత్త కనకమ్మ రోజు తాగి వచ్చి భవానిని తిడుతూ కొడుతూ వేధింపులకు గురి చేసేది.దీనికిగాను శ్రీకాంత్ కూడా ఆమెతో సపోర్ట్ చేసేవాడు.దాంతో ఆమె మానసిక వేదనకు గురైంది.రెండు రోజుల క్రితం భవాని,శ్రీకాంత్ లు ఫ్యామిలీ ఫంక్షన్ ఉండడంతో వాళ్ల సొంత ఊరు సిద్దిపేటకు వెళ్లారు.అక్కడ కూడా కనకమ్మ,శ్రీకాంత్ లు అందరి ముందు ఆమెను ఇష్టం వచ్చినట్లు తిట్టి అందరి ముందు అవమానించారు.కాగా మే30న ఉదయం 8.30గంటలకు భవాని ఆమె తండ్రి ఎల్లయ్యకు ఫోన్ చేసి ఏడుస్తూ ఆమె కుటుంబ సభ్యులు ఆమెను మానసికంగా తీవ్ర వేదనకు గురి చేశారని,తనకు ఇకపై బ్రతకాలని లేదని చెప్పి,వారి ఇల్లు మాణిక్యమ్మకాలనీ రాజేంద్రనగర్ లో ఇంట్లో ఎవరూ లేనీ సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయింది.ఈ విషయంపై మృతురాలి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధ్యాయుల వేతనాల్లో కోతలు సమంజసం కాదు..

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ డిమాండ్

**రాజేంద్రనగర్,మే31(సూర్యరేఖ)**



ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు విధిం చడం సమంజసం కాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ( మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... హెల్త్ కార్డులకు సంబంధించిన విధివిధానాలు ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించ కుండా ప్రీమియం వసూలు చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు.అధికారికంగా కార్డులు జారీ చేయకుండా,పథకంపై పూర్తి సమాచారం ఇవ్వకుండానే జీతాల్లో కోత విధించడం ఉపాధ్యాయులను మోసగించడమేనని వారు ఆరోపించారు.అప్పటి వరకు వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లించి,కార్డులు జారీ చేసి,విధివిధానాలు స్పష్టం చేశాకనే తిరిగి కోతలు చేపట్టాలని కోరారు.ఈ హెల్త్ కార్డు పథకం ఇష్టం లేని వారికి దాని నుండి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు.ఇద్దరు ఉద్యోగులైన భార్యాభర్తల విషయంలో ఒకరి జీతం నుండే ప్రీమియం వసూలు చేయాలని సూచించారు.యువతీ యువకులకి కూడా ఈ పథకం వర్తించేలా,డిపెండెంట్లకు వయోపరిమితిని 25 నుండి 35 సంవత్సరాలకు పెంచాలని కోరారు.సీనియర్,జూనియర్ అనే తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన ప్రీమియం విధానాన్ని అమలు చేయాలన్నారు.

# మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ రాజేంద్రనగర్ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి





**రాజేంద్రనగర్,మే31(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజక వర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో సాయిబాబానగర్ బిజెపి సీనియర్ నాయకులు సంతుగౌడ్ నివాసంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ 134వ మన్ కి బాత్ కార్యక్రమాన్ని బూత్ నంబర్లు 352,353, 354లలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ ,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది.భారతదేశ క్రీడా ప్రతిభను ప్రశంసిస్తూ,క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శనలు చేసి దేశానికి గర్వకారణంగా నిలిచారని ప్రధాని మోదీ ప్రస్తావించారని తెలిపారు. కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, తర్వాతి తరం క్రీడాకారులకు స్ఫూర్తినిస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బి.నర్సింహ,రమేష్ రెడ్డి,ఎన్ను శంకర్ రెడ్డి,రామరావు ,శేఖర్, గురు స్వామి కిరణ్,రాజలింగం రమేష్ యాదవ్ విజయ్,చింటూ రెడ్డి,మహిళలు,డివిజన్ నాయకులు బూత్ అధ్యక్షులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

**రాజేంద్రనగర్,మే31(సూర్యరేఖ)**భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్ కీ బాత్ 134వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని అత్తాపూర్ లో బూత్ నెంబర్ 235 లో డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు డాకా కృష్ణవేణి ఇంట్లో పాల్గొని చూశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రెటరీ సాబాద విజయ్ కుమార్ విచ్చేసినారు.ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాట్లాడుతూ..మన దేశంలోని అనేక ప్రాంతాలలో మన దేశ ప్రజలు దేశ హితం కోసం సమాజ హితం కోసం ఎన్నో అద్భుతమైన పనులు చేస్తున్నారు.వారి గురించి విన్నప్పుడు మనకు ఒక కొత్త ప్రేరణ లభిస్తుంది.కొద్ది రోజుల క్రితం అథ్లెటిక్స్ లో దేశం సాధించినటువంటి ఒక ఘనతతో ప్రారంభిస్తాను.ఝార్ఖండ్ లోని రాంచి జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ సమాఖ్య పోటీలు జరిగాయి.ఇందులో సుమారు 800మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాలుగు వేరు వేరు క్రీడాంశాలలో నాలుగు జాతీయ రికార్డులు బద్దలయ్యాయి.గురువిందర్ సింగ్,విశాల్ టికే,తేజస్విని శంకర్,దేవ్ మీనా,కుల్దీప్ కుమార్,ఈ మిత్రులు వేర్వేరు విభాగాలలో కొత్త రికార్డులు సృష్టించారు.నేను ముందుగా వీరందరికీ చాలా చాలా అభినందనలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.మిత్రులారా ఒక క్రీడా



అంశం అది విశ్వనీయంగా బాగా చర్చనీయాంశం అయింది.అదే 100 మీటర్ల పరుగు పందెం.కేవలం రెండు రోజుల వ్యవధిలోనే పురుషుల వంద మీటర్ల పరుగు పందెం జాతీయ రికార్డు మూడుసార్లు బద్దలైంది.ఈ అద్భుతాన్ని చేసిన ఇద్దరు క్రీడాకారులు గురువిందర్ వీర్ సింగ్ మరియు అనుమేష్ కుజూర్ అని తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో డాకా రామ్ రెడ్డి,రవి కిరణ్,యశస్విని,భాగ్య,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్యతండాలో ఘనంగా బొడ్రాయి 4వ వార్షికోత్సవం..

పెద్ద ఎత్తున పాల్గొన్న గ్రామస్తులు,భక్తులు..

బాల్యతండలో ఆధ్యాత్మిక సందడి..పండుగ వాతావరణం

గ్రామ దేవత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి..

సర్పంచ్ జరుపుల కాలునాయక్






**మరిపెడ,మే31(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్యతండా గ్రామ పంచాయితీలో బొడ్రాయి ప్రతిష్టాపన 4వ వార్షికోత్సవాన్ని సర్పంచ్ జరుపుల కాలునాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు .వార్షికోత్సవం సందర్భంగా ఉదయాన్నే బొడ్రాయి వద్ద ప్రత్యేక అలంకరణలు చేశారు.అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సహస్ర ఘటాభిషేకం,క్షీరాభిషేకం నిర్వహించి వార్షికోత్సవ పూజలను నిర్వహించారు.గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని పంటలు సమృద్ధిగా పండేందుకు ఆశీర్వదించు తల్లి అంటూ పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు.ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా పెద్దలు,మహిళలు,యువకులు, భక్తులు ,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.గ్రామంలోని మహిళలు,భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో బాల్యతండా గ్రామ పంచాయతీలో ఆధ్యాత్మిక సందడి సంతరించుకోవడంతో పాటు పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సర్పంచ్ కాలునాయక్ మాట్లాడుతూ...సకల దేవతల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.గ్రామ దేవత ఆశీర్వాదంతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సంవృద్ధిగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ,సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీపీ పెద్దలు,మహిళలు, యువకులు,గ్రామస్తులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద సమస్యకు రేకుల షెడ్డు నిర్మాణం..

గ్రామంలో ఆకర్షణగా నిలిచిన రేకుల షెడ్డు నిలయం..

**నిజాంపేట,మే31(సూర్యరేఖ)** కోతుల బెడద సమస్య పరిష్కారానికి నిజాంపేట మండలం కేంద్రానికి చెందిన జీడీ రాములుగౌడ్,తన వినూత్న ఆలోచనతో పెంకుటిల్లుపై రేకుల షెడ్డు వేయించారు.దీంతో వర్షాకాలం ఇల్లు ఉరవకుండా ఉంటుందని అలాగే కోతుల సమస్య నుండి విముక్తి కలుగుతుందన్నారు.కోతులు పెంకుటిల్లపై దూకుడం ఇండ్లలోకి వచ్చి తినుబండారాలు ఎత్తుకెళ్లి ఇంటి పైన గుణలు తీసివేయడం పగలగొట్టడం ద్వారా వర్షాలు పడడంతో పెంకుటిల్లు బాగా ఉరుస్తాయని ఈ రేకులు వేయడం వల్ల కోతుల నుండి విముక్తితో పాటు వర్షాలకు రక్షణగా జరుగుతుంది.పాత ఇండ్లను రేకులతో ముస్తాబు చేసుకున్నట్లయితే మరో 10సంవత్సరాలు నివాసం ఉండవచ్చు అన్నారు. కోతుల నివారణకు రేకుల షెడ్డు ఉపయోగం.. జీడి రాములుగౌడ్ నిజాంపేట కోతుల నివారణకు రేకుల షెడ్డు ఎంతో ఉపయోగ పడుతుంది.పెంకుటిల్లుపై కోతులు వచ్చి పగలగొట్ట డం ఇండ్లలోనుండి తిను బండారాలు ఎత్తుకెళ్లడం జనాలపై దాడులు చేయడం జరిగేది. రేకులపై కప్పుల ఉపరితలం చాలా నులుపుగా ఉండడం వలన కోతులు పట్టు కోల్పోయి జారిపడతాయి.దీనివల్ల అవి టెర్రస్ పైకి ఇంటిపై కప్పు పైకి ప్రవేశించవు కావున కోతుల విముక్తి కోసం రేకుల షెడ్లు ఎంతో ఉపయోగపడతాయి.




## నాచారంలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం..

ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,మే31(సూర్యరేఖ)** నాచారం డివిజన్ మరియు హెచ్ఎంటినగర్ రెండు డివిజన్లలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిజెన్ శేఖర్,మేడల మల్లికార్జున్ గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఆదివారం సి.కె.గార్డెన్ లో పార్టీ సభ్యత్వ నమోదు విషయమై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై దిశానిర్దేశం చేయడం జరిగింది.నాచారం,హెచ్ఎంటినగర్ డివిజన్లో గత పది సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి,అలాగే ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి డివిజన్లోని అన్ని సమస్యల పరిష్కారానికి వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం పట్ల ప్రజలు బిఆర్ఎస్ పార్టీ పట్ల సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కష్టసమయంలో అండగా గుంపెళ్ల గూడెం గ్రామ ఉద్యోగ సంఘం..




**కారేపల్లి,మే31(సూర్యరేఖ)** సింగరేణి మండలం గుంపెళ్ల గూడెం గ్రామ ఉద్యోగ సంఘం మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందిన కున్సోత్ సీతారాములు (చినుకు)కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం అందజేసింది.అలాగే అనారోగ్యంతో మృతి చెందిన ఎర్రబెల్లి ప్రభాకర్ తల్లి కుటుంబానికి కూడా 50కిలోల బియ్యం అందించి అండగా నిలిచింది.గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ,అవసరమైన సమయంలో సహాయం అందించడం ఉద్యోగ సంఘం ప్రత్యేకతగా నిలుస్తోంది.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బానోత్ వీరన్న,ప్రధాన కార్యదర్శి గుగులోత్ శంకర్, సభ్యులు భూక్యావీరన్న (ఆర్మీ),బానోత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి-వీరబాబు ఉద్యోగ సంఘం సేవా కార్యక్రమాలను అభినందించారు. గ్రామంలో మానవీయ విలువలను పెంపొందిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

## రంగనాథస్వామి దేవాలయం వేదికగా హింధువుల ఐక్యత కోరుతూ ఘనంగా సమ్మేళణం..




**నాంపల్లి,హైదరాబాద్, మే31(సూర్యరేఖ)** ఆర్ఎస్ఎస్ స్థాపించబడి 100సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యావత్తు భారతదేశంలో ఆర్ఎస్ఎస్ శాఖలు నిర్వహించే హిందూ సమ్మేళ నాలు స్థానిక ఆయా ప్రాంతాలలో ప్రతి హిందూ పాల్గొనే విధంగా స్థానిక ప్రజల ద్వారా జరపాలని నిర్ణయించి,పిలుపును ఇచ్చిన నేపథ్యంలో భాగంగా మన జియాగూడ రంగనాథ బస్తి ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో జియాగూడ రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణం వేదికగా స్థానిక ప్రజల ద్వారా శనివారం రాత్రి హిందూ సమ్మేళన తాత్కాలిక కమిటీ అధ్యక్షులుగా ఆకుల సుదర్శన్,కార్యదర్శులు దేవర మహేష్,బి.శివ కుమార్ యాదవ్,జె .లక్ష్మీనారాయణ,కోశాధికారి వుల్పే శ్రీనివాస్,సహాయ కార్యదర్శులు ఆర్.సంతోష్ కుమార్,బి,భాస్కర్ గుప్త,సురేష్,హరి,శ్రీనివాస్ తదితరులతో కమిటీ ఏర్పాటు చేసి సమ్మేళనం జయప్రదం చేయడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యఅతిథి శ్రీబ్రహ్మశ్రీ బెనారస్ గురుజీ శ్రీశంకరాచార్య సాంప్రదాయ జగదాంబ త్రీశక్తి పీఠం,వక్తలుగా గురువింజ రామచంద్రయ్య,సంఘ ప్రచారకులు వనవాసి కళ్యాణ ఆశ్రమం,సాది శ్రీవాణి,వి.హెఛ్.పి తెలంగాణ ప్రాంత మాతృశక్తి సహ సంయోజికలు పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమములో సంస్కృతిక కార్యక్రమాలు, పారాయణం శాస్త్రీయ నృత్యం,భక్తి సంగీతం,భజనలు ఇత్యాది కార్యక్రమాలు చూపరులను మంత్రముగ్ధులను చేసాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశానికి ఆత్మ హిందూ ధర్మం,హిందూ సంస్కృతి మరియు హిందు సమాజం కావున హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి,సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో సమ్మేళనం నిర్వహించమని,హిందూ సమాజం పట్ల గౌరవభావం,ఏకత్మతా భావన,స్వధర్మం పట్ల అంకితభావం,సేవాగుణం వంటి వాటిని వికసింపచేసేందుకు మీ,మా,మనందరి భాగస్వామ్యంతో హిందూ సమ్మేళనం జయప్రద చేయడమైనద అన్నారు.ఈ సమావేశంలో దాదాపు 800మంది స్థానిక ప్రజలు పాల్గొనడం జరిగినది.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# పదవీ విరమణ మహోత్సవం



**ఆసిఫాబాద్,మే31(సూర్యరేఖ):** ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ తప్పనిసరి అంకిత భావం తోగిరిజన సంక్షేమ శాఖాలో విధులు నిర్వహించడం సంతోషకరం ఏసిఏంఓ పూర్కా ఉద్ధవ్ అన్నారు.గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల యపాల్ పట్టి ఆసిఫాబాద్ మండల్ ఉపాధ్యాయులు నైతం అతేక్ రావ్ మారుమూల గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు.గిరిజన సంక్షేమ శాఖా ఎప్పటికి మరువదు అని పిఏంఆర్సి ఏసిఏంఓ పూర్కా ఉద్ధవ్ చెప్పారు.తదానంతరం తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం టీఎస్ టీడబ్ల్యూటీయు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ.. మృదుస్వభావి సౌమ్యులు,పరోపకారి,ఎవరి మనసును నొప్పించకుండా గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల యపాల్ పట్టి ఆసిఫాబాద్ మండలంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన నైతం అతేక్ రావ్ కు అభినందనలు తెలియజేశారు.ఆదివారం స్థానికంగా తన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖా ఏ సి ఏం ఓ పూర్కా ఉద్ధవ్ పాల్గొన్ని శాలువాతో సన్మానించారు.అనంతరం అయన మాట్లాడుతూ..ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ ఎప్పుడో ఒకసారి కావాల్సిందే,వారి శేష జీవితము ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆయురారోగ్యాలు కలిగి ఉండి,కుటుంబ సభ్యులతో సుఖంగా ఉండాలని,వారు సంతోషంగా ఉండి,కాలంతో పాటు ముందుకు సాగాలని,వారు అనుకున్న లక్ష్యానికి చేరువ కావాలని,సామాజిక బాధ్యతను అలాగే నిర్వహిస్తూ,అందరి ఆదరాభిమానాలు పొందుతూ ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,వారికి మరోసారి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు మనస్ఫూర్తిగాబి తెలియజేసుకుంటున్నామని చెప్పారు.ఇదే విధంగా కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్టి డబ్ల్యూటియు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ..ఐటీడీఏ ఏజెన్సీ ప్రాంతంలో వివిధ మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహించడం గిరిజన సంక్షేమ శాఖాకు సేవలు అందించడం చాలా సంతోషకరం.సౌమ్యులుగా గిరిజన సంక్షేమ శాఖా ఉద్యోగస్తులతో సత్సంభందలు కల్గి అందరి మన్ననలు పొంది ఈరోజు సన్మానం అందుకుంటున్న నైతం అతేక్ రావ్ కు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ..గిరిజన సంక్షేమ శాఖలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలు అందించడం సంతోషం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఎస్టీడబ్ల్యూటీటీఎస్టిడబ్ల్యూటియు జిల్లా కార్యవర్గం సభ్యులు కోశాధికారి కూడ్మేత,ఆనంత్,కార్యదర్శులు కోర్వేత మనోహర్,అసోసియేషన్ అధ్యక్షులు కొముురం మాధవ్ రావ్,పెందూర్ భీంరావ్ మాడావి భీమ్ రావ్,నవనందుల దామోదర్ కూడ్మేత జంగు,రాష్ట్ర నాయకులు కొట్నాక్ యాదవురావ్ కుర్సెంగా శ్రీనివాస్,మడావి భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు దిక్కులేని కుటుంబానికి అండగా సర్పంచ్..దేవయ్య వృత్తితో లింగాపూర్ లో విషాదం..

కన్నీటి మధ్య మానవత్వం..దేవయ్య కుటుంబానికి రూ.5వేల సాయం అందించిన సర్పంచ్ రామకృష్ణయ్య..

అంతిమయాత్రకు అండగా సర్పంచ్..కన్నీటి కడలిలో మునిగిన లింగాపూర్

"బతికున్నంత కాలం పేదరికంతో పోరాడిన దేవయ్య.. మరణించిన తర్వాత కూడా అంత్యక్రియల ఖర్చు కోసం కుటుంబం ఆవేదనలో మునిగిపోగా,గ్రామ సర్పంచ్ అందించిన చేయూత గ్రామాన్ని కదిలించింది."



**రామాయంపేట,మే31(సూర్యరేఖ)** మరణం ప్రతి మనిషి జీవితంలో అనివార్యమైనదే. కానీ ఆమరణం తర్వాత కూడా అంత్యక్రియలు నిర్వహించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవడం హృదయ విదారక ఘటన.రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన తుడుము దేవయ్య ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దేవయ్య కుటుంబం, అంత్యక్రియల నిర్వహణకు కూడా నిధులు లేక తీవ్ర ఆందోళనకు గురైంది.ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మానెగండ్ల రామకృష్ణయ్య మానవత్వంతో స్పందించి వెంటనే రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న వారి వద్దకు స్వయంగా వెళ్లిన సర్పంచ్ రామకృష్ణయ్య,కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ క్లిష్ట సమయంలో అందించిన ఆర్థిక సహాయం కేవలం డబ్బు మాత్రమే కాదని,కష్టాల్లో ఉన్న కుటుంబానికి నైతిక బలాన్ని ఇచ్చిందని గ్రామస్తులు పేర్కొన్నారు.దేవయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన గ్రామస్తులు కన్నీటి నివాళులు అర్పించారు."మనిషి చనిపోయిన తర్వాత కూడా అతని కుటుంబం ఒంటరిగా లేదని నిరూపించిన సర్పంచ్ చర్య అభినందనీయమని" పలువురు గ్రామ పెద్దలు కొనియాడారు.మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం అంత్యక్రియల ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి అండగా నిలిచి,తక్షణ సాయం అందించిన సర్పంచ్ మానెగండ్ల రామకృష్ణయ్య మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.కష్టకాలంలో ఇచ్చే చేయూతే నిజమైన సేవ అని మరోసారి ఆయన నిరూపించారని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు."చనిపోయిన మనిషిని తిరిగి తీసుకురాలేం...కానీ ఆ కుటుంబం కన్నీళ్లు తుడిచే చేయి మాత్రం మనమవ్వగలం"అనే సందేశాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

## పంట పొలాల వ్యర్థాలను తగలబెడితే కఠిన చర్యలు..

ఎస్సై హరిత




**ఖమ్మం,మే31(సూర్యరేఖ)** కల్లూరు మండల రైతులకు పరిసర ప్రాంత రైతులకు పంట పొలాలో వ్యర్థాలను తొలగించుటకు నిప్పుతో తగలబెట్టడం మూలంగా భూమిలో ఉన్న కీటకాలు చనిపోయి భూసారం తగ్గుతుందని ఎస్ఐ హరిత రైతులకు సూచించారు. భూమికి పోషకాలు అందించే వ్యర్థాలను వేసవి దుక్కులు దున్నుట వలన ఈ అర్థాలు ఎరువుగా మారుతాయి అని తెలిపారు.నిప్పు పెట్టుట వల్ల వేరే పొలంలో ఉన్న చెట్లకు అంటుకొని చనిపోవడం,బాటసారిలకు నీడను అందించే చెట్లు అగ్నికి హోహుతి అవుతున్నాయని చెప్పారు.బాటసారి ఆ పొగ వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు ఎస్ఐ తెలియజేశారు.కల్లూరు మండలంలో రైతులు వ్యర్థాలను తగలబెట్టడం మానుకోకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ,కేసులు నమో చేస్తామని హెచ్చరించారు.

## బాసర ట్రీబుల్ ఐటీకి ఐశ్వర్య విద్యార్థిని ఎంపిక..



**నిజాంపేట,మే31 (సూర్యరేఖ)** మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన ల్యాగాల ఐశ్వర్య బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఆమె564 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచి ప్రతిభ కనబరిచింది. ఐశ్వర్యకు 2026-27విద్యా సంవత్సరానికి గాను సీటు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థినిని,ఆమెకు సహకరించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని గ్రామస్థులు,ఎంఈవో అభినందించారు. భవిష్యత్తులో ఐశ్వర్య మరిన్ని ఉన్నత శిఖరాలను అవరోదించాలని వారు ఆకాంక్షించారు.

## బెల్లంపల్లిలో కరెంట్ షాక్‌తో మేకలు మృతి..


సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించిన పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్



**బెల్లంపల్లి,మే31(సూర్యరేఖ)**ఆదివారం కురిసిన వర్షానికి బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డులో చిప్ప సురేష్‌కు చెందిన మేకలు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి.విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి ప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ సిబ్బందిని పిలిపించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు.అనంతరం పశువైద్య అధికారులతో మాట్లాడి మృతిచెందిన మేకలకు పంచనామా నిర్వహించేలా చర్యలు చేపట్టారు.అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం..

ఎల్లంపేట కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గండి వీరభద్రం



**మరిపెడ,మే31(సూర్యరేఖ)**ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని ఎల్లంపేట కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గండి వీరభద్రం అన్నారు.ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలోని లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా గండి వీరభద్రం మాట్లాడుతూ ...సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు.సీఎం సహాయనిధి ద్వారా పేదలు,వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి మేలు జరుగుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటోందని పేర్కొన్నారు.పేదలు సీఎం సహాయ నిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు.ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు చెక్కుల పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి,ఎమ్మెల్యేకు,పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు,ఎమ్మెల్యేలు







**బెల్లంపల్లి,మే31(సూర్యరేఖ)**కొముురంభీమ్(ఆసిఫాబాద్)జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో కొత్తరి గ్రామ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు,బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేదిక,తాగునీరు,పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దాండే విటల్,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అత్రం సుగుణ,మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు,జిల్లా కలెక్టర్ హరిత,వివిధ శాఖల అధికారులు ,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లు రవిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**కామారెడ్డి,మే31(సూర్యరేఖ)** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు,సీనియర్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేసిన టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,కి ఐరేని సందీప్ ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది.పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు ఫిర్యాదు చేశారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా,కామారెడ్డి నియోజకవర్గంలో గత నాలుగున్నర,దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, వేలాది మంది కార్యకర్తలకు మార్గదర్శకులుగా నిలిచిన రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పై పిసిసి జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యక్తిగత విమర్శలు పార్టీ శ్రేణుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి.గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ప్రెస్ కాన్ఫరెన్స్ లో వాడిన పదజాలం కాంగ్రెస్ పార్టీ సంస్థ గౌరవాన్ని తగ్గించే విధంగా ఉండడమే కాకుండా, బిజెపి ఎమ్మెల్యే వాడిన పదజాలాన్ని తను కూడా వాడి బిజెపి ఎమ్మెల్యేను సమర్థిస్తున్నట్టుగా ఉంది. ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కించపరిచే విధంగా పబ్లిక్ గా ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడడం క్రమశిక్షణ రాహిత్యమే..పార్టీలో కొనసాగుతూ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించడం,సీనియర్ నాయకుల ప్రతిష్టను దెబ్బతీయడం,గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా ఆయన ప్రవర్తన కొనసాగుతోంది. గతంలో ఇతర పార్టీల్లో కూడా ఇలాంటి వివాదాస్పద వైఖరి కారణంగా పార్టీ నుండి సస్పెండ్ కు గురైన వ్యక్తి,ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కూడా అదే ధోరణిని కొనసాగుతుందన్నారు.

## బిఆర్ఎస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలి..

విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో రాగిడి లక్ష్మారెడ్డి



**మేడ్చల్,మే31(సూర్యరేఖ)** బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి నిబద్ధతతో పనిచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు.మేడ్చల్ లోని ఓకన్వెన్షన్ హాల్లో ఆదివారం మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం,ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి,లు ముఖ్యఅతిధులుగా పాల్గొని మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రాగిడి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలన్నారు.పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు.రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోసించిన ఉద్యమ కారులను పార్టీ ఎప్పటికి మరిచిపోదని, వారిని గుండెల్లో పెట్టుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లంపేట్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రవి నాయక్,మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్,ప్రధాన కార్యదర్శి సుదర్శన్,మాజీ వైస్ ఎంపిపి వెంకటేష్,మేడ్చల్ జిల్లా బిఆర్టియు అధ్యక్షులు సంబు ప్రభాకర్,కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఉద్యమ కారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక..





**ఆదిలాబాద్,మే31(సూర్యరేఖ)** ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జాతీయ అధ్యక్షులు మోహన్ సింగ్ రాథోడ్,బోత్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్,మాజీ అధ్యక్షులు అమర్ సింగ్ తీలావత్ సమక్షంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ జిల్లా అధ్యక్షునిగా రాథోడ్ భీమ్ రావ్,ప్రధాన కార్యదర్శిగా జాదవ్ పవన్ నాయక్,ఉపాధ్యక్షుడిగా ఆడే గోవర్ధన్,జాయింట్ సెక్రటరీగా హీరలాల్,లను ఎన్నుకున్నారు.

## వెంకటేశ్వరనగర్ లో టిఆర్ఎస్ పార్టీ జెండా గద్దె భూమి పూజ..

టిఆర్ఎస్ పార్టీ నాయకురాలు హాలిమా



**ఖైరతాబాద్,మే31(సూర్యరేఖ)** రాజకీయంగా ప్రతి ఒక్కరు ఎదిగేందుకు టిఆర్ఎస్ పార్టీలో చేరి కవితక్క నాయకత్వంలో పనిచేసేందుకు సంసిద్ధం కావాలని టిఆర్ఎస్ పార్టీ నాయకురాలు హాలిమా తెలిపారు.ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 జీవీకే మహల్ ఎదురుగా వెంకటేశ్వరనగర్ లో టిఆర్ఎస్ పార్టీ జెండా గద్దె కోసం టిఆర్ఎస్ పార్టీ హలీమా ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించడం జరిగింద న్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..జూన్ 4వ తేదీన టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని,పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో తేజచౌదరి,ప్రోగ్రాం ఇంచార్జ్ మీనా చోహన్ ,లక్ష్మీనారాయణమ్మ,స్వాతి,పావని,లావణ్య,టిఆర్ఎస్ర్యకర్తలు ,అభిమా నులు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఐటీ బాసరాలో సీట్లు సాధించిన టీజీ మోడల్ స్కూల్ మరిపెడ విద్యార్థులు..







**మరిపెడ,మే31(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ తెలంగాణ మోడల్ స్కూల్ కు చెందిన ముగ్గురు విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుతూ ఐఐఐటీ బాసరాలో ప్రవేశాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ అఖ్తరుజ్జమాన్ మహ్మద్ ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన జి.పూర్ణశ్రీ,బి.చరణ్,బి.ఆకాష్ ఐఐఐటీ బాసరాలో సీట్లు సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందిం చారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ...విద్యార్థులు ఐఐఐటీ బాసరాకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా మారిందన్నారు.ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు చాలా పోటీ ఉన్నప్పటికీ తమ విద్యార్థులు ప్రతిభతో నిలబడ్డారని చెప్పారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కూడా పోటీ ప్రపంచంలో రాణించగలరని ఈ ఫలితాలు నిరూపించాయని అన్నారు .విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం విజయానికి కారణమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమని,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


## 30ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు..



**నిజాంపేట,మే31(సూర్యరేఖ)**మండల కేంద్రంలోని శ్రీరేణుకమాత ఫంక్షన్ హాల్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97బ్యాచ్ కు సంబంధించి ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...30 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులం ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని,విద్యార్థి దశలో ఉన్నప్పుడు వారు చేసిన తీపి జ్ఞాపకాలను మరోసారి నెమరు వేసుకున్నారు.తమతోపాటుముగ్గురు విద్యార్థులు అకాల మరణం చెందగా వారి ఆత్మశాంతి చేకూరాలని పూర్వ విద్యార్థులు మౌనం పాటించారు.అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు మేమోటోస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, బాలయ్య, జనార్ధన్ రెడ్డి, విద్యార్థులు నసీరుద్దన్,శివప్రసాద్,దండు ప్రభాకర్, ఎల్లం యాదవ్,శ్రీనివాస్ యాదవ్,నాగరాజు,ఆకుల ఎల్లం, మల్లేశం, మోహన్ రెడ్డి,మహేందర్,నర్సింలు, ప్రవీణ్ రెడ్డి,కుమారస్వామి, సహదేవ్,యాదగిరి,ప్రభు దాస్,శ్రీకాంత్,సుమంత్,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కాంటలు ఆలస్యం,ఇబ్బందులకు గురవుతున్న రైతులు..

కొనుగోలు వేగవంతం చేయాలని బిఆర్ఎస్ సర్పంచ్ల డిమాండ్..





**నిజాంపేట,మే31(సూర్యరేఖ)** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సొసైటీ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలో ఉన్న వరి ధాన్యాన్నీ వెంటనే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం రైస్ మిల్లర్ల నిర్లక్ష్యన్నీ తీవ్రంగా ఖండిస్తున్నామని కల్వకుంట గ్రామ సర్పంచ్ అందె కొండల్ రెడ్డి,రజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు,లు అన్నారు.రైతులకుఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి,లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద మొత్తంలో ధర్నా చేస్తామని వారు ప్రభుత్వానికి హెచ్చరించారు.పక్కా మండల నుంచి వచ్చిన ధాన్యన్నీ సేకరిస్తున్నారు.పక్క మండలంపై ఉన్న శ్రద్ధ రైస్ మిల్లర్లకు మన మండల ధాన్యం మీద సోయి లేదా.!ఇది వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి ట్రాక్షిట్ ఇవ్వడం లేదు ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వడ్ల కొనుగోలును వేగవంతం చేసి చేయాలని వారు కోరారు.

## మోకిలలో దిక్వాంటియం స్కూల్ ను ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల




**శంకర్‌పల్లి,మే31(సూర్యరేఖ)** శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామ శివారులో ఆదివారం దిక్వాంటియం స్కూల్ ను రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల చైర్మన్ వెంకట్ ముర్కి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్,మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్,ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య,లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ...విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు.గ్రామీణ వాతావరణంలో స్కూల్ లు రావడం సంతోషించ దగ్గ విషయం అన్నారు.ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ... పాఠశాలలో చేరే విద్యార్థులకు ఫీజులు తక్కువ తీసుకోవాలి,నియోజకవర్గ ప్రాంత విద్యార్థులకు అవకాశం కల్పించాలని పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, మోకిల సర్పంచ్ శేఖర్, పాఠశాల యాజమాన్యం రవీందర్ రావు,రఘునాథ్ రావు,ప్రిన్సిపల్ సంధ్య రమేష్,సావిత్రి పొట్లూరి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు,పాల్గొన్నారు.

# ఎంపీ ఈటలపై దుష్ప్రచారం చేస్తే ఖబర్దార్.!







**కుట్రలు,చిల్లర రాజకీయాలను బీజేపీ సహించదు:**
**మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి హెచ్చరిక**

**మేడ్చల్,మే31(సూర్యరేఖ)**మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని ఈటల నివాసం వద్ద ఏర్పాటు చేసిన వివాదాస్పద ఫ్లెక్సీల వ్యవహారంపై మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు.ఎంపీ ఈటల రాజేందర్‌పై అసత్యప్రచారాలు,రాజకీయ కుట్రలు చేసే వారిని బీజేపీ శ్రేణులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవని స్పష్టం చేశారు.ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారంతా ప్రజల్లో ఎదుర్కోలేక చీకటి రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ... "ఎంపీ ఈటల రాజేందర్ ప్రజాదరణను చూసి ఓర్వలేక కొందరు కావాలనే దుష్ప్రచారానికి తెరలేపుతున్నారు.ప్రజల్లో తిరిగి రాజకీయాలు చేసే ధైర్యం లేని వారు రాత్రి వేళల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి పనులు చేసే వారు ఎంతటి వారైనా ఖబర్దార్..బీజేపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు" అని హెచ్చరించారు.ప్రజా నాయకుడిపై బురదజల్లే ప్రయత్నంఈటల రాజేందర్ తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా సమస్యల వరకు నిరంతరం పోరాడిన నాయకుడని,అలాంటి వ్యక్తిపై నిరాధార ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ దురుద్దేశమే కనిపిస్తోందని విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. "ప్రజల్లో ఆదరణ కోల్పోయిన నాయకులు ఇప్పుడు కుట్రల రాజకీయాలకు తెరలేపుతున్నారు.ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడిని విమర్శలతో దెబ్బతీయాలని చూస్తున్నారు.కానీ ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో ఈటల రాజేందర్ ఇమేజ్‌ను రవ్వంత కూడా దెబ్బతీయలేరు"అని స్పష్టం చేశారు. దమ్ముంటే బహిరంగంగా మాట్లాడాలి ఫ్లెక్సీల ద్వారా ఆరోపణలు చేసే వారిపై విక్రమ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు."నిజంగా మీ దగ్గర ఆధారాలు ఉంటే,మీ ఆరోపణల్లో నిజం ఉంటే ప్రజల మధ్యకు వచ్చి మాట్లాడండి.బహిరంగ చర్చకు రండి. అంతేగానీ అర్ధరాత్రి వేళల్లో దొంగచాటుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పారిపోవడం రాజకీయ పిరికితనానికి నిదర్శనం.ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని అన్నారు.బీజేపీపై కుట్రలు ఫలించవు బీజేపీ దేశంలోనే అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే నాయకులకు ఇక్కడ స్థానం లేదని విక్రమ్ రెడ్డి అన్నారు."పార్టీలో గందరగోళం సృష్టించాలని, ఎంపీ ఈటల రాజేందర్ పై అనుమానాలు కలిగించాలని చూస్తున్న వారి పప్పులు ఉడకవు..బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం పనిచేస్తారు.కుట్రలు, కుతంత్రాలతో పార్టీని బలహీనపరచాలనే ప్రయత్నాలు ఎప్పటికీ విజయవంతం కావు" అని పేర్కొన్నారు.సూత్రధారులను వదిలిపెట్టం.. ఈ ఘటన వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని ఇప్పటికే పోలీసులను కోరినట్లు విక్రమ్ రెడ్డి తెలిపారు."ఫ్లెక్సీలు కట్టిన వారిని మాత్రమే కాదు, వారి వెనుక ఉండి ఈ కుట్రను నడిపించిన సూత్రధారులను కూడా బయటపెట్టాలి.చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు బీజేపీ శ్రేణులు పోరాడుతాయి.ఎవరు ఎంత పెద్ద వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు"అని హెచ్చరించారు. ఖబర్దార్..వ్యక్తిగత దూషణలు ఆపాలి ఎంపీ ఈటల రాజేందర్‌పై వ్యక్తిగతంగా లేదా రాజకీయంగా అసత్య ప్రచారాలు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విక్రమ్ రెడ్డి స్పష్టం చేశారు.

# వెట్టిచాకిరి నిర్మూలనలో ఐనాల వారి పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి..






**ఐనాల వారు విద్య పరమావధిగా కొనసాగాలి..**
**తెలంగాణ ఇంటలేక్చువల్ పోరం రాష్ట్ర కార్యదర్శి ఐనాల సైదులు**

**మరిపెడ,మే31(సూర్యరేఖ)** వెట్టిచాకిరి నిర్మూలనలో ఐనాల వారి పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని తెలంగాణ ఇంతలేక్చువల్ పోరం రాష్ట్ర కార్యదర్శి ఐనాల సైదులు పిలుపునిచ్చారు.ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలోని స్థానిక వివిఎన్ ఫంక్షన్ హాల్ ఐనాల వారి ఆత్మీయ సమ్మేళనం నిర్వహణ కమిటీ బాధ్యులు ఐనాల బిక్షం అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఇంతలేక్చువల్ పోరం రాష్ట్ర కార్యదర్శి ఐనాల సైదులు,స్పాట్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐనాల పరశురాములు పాల్గొని మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఐనాల వారి త్యాగాలు స్ఫూర్తి దాయకం అని అన్నారు.అదేవిధంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వెట్టిచాకిరి నిర్మూలన పోరాటాల్లో ఐనాల వారి పాత్ర మరువలేనిదని అన్నారు.నిజాం పరిపాలనంలో రజాకార్ల ఆగడాలకు వెట్టి మాదిగలను ఏకంచేసి ఎదిరించిన ఐనాల వెంకయ్య ఆత్మగౌరవ ఉద్యమం నేటి తరానికి ఆదర్శమన్నారు. చరిత్ర బదంకాని ఐనాల వారి త్యాగాలకు అక్షర రూపం ఇవ్వాల్సిన అవసరముందన్నారు. హైదారాబాద్ కేంద్రంగా దళిత ఉద్యమాల్లో భాగంగా కొనసాగిన వెట్టి విముక్తి పోరాటాలు మరుగున పడిపోయాయని వాటిని వెలికి తీయాల్సిన అవసరం ఉందని అన్నారు.కార్యక్రమంలో భాగంగా ఐనాల వారి ఐదవ తరం పెద్దలనుఆడబిడ్డలను ఘనంగా సన్మానించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరువూరు,కాకర్ల,తెలంగాణ లోని ఖమ్మం జిల్లాలోని కేజీసిరిపురం,అమ్మపాలేం,పినపాక,పాతర్లపాడు,ఖమ్మం,మహబూబాబాద్ జిల్లాలోని ఎల్లంపేట,మరిపెడ,చిల్లంచర్ల, నేరడ,అబ్బాయిపాలెం, కంబా లపెల్లి, ఉగ్గంపల్లి,చిన్న నాగారం,సూర్యాపేట జిల్లాలోని కుక్కుడం తదితర ప్రాంతాల నుండి సుమారు 1,000 మందికి పైగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లంపేట నిర్వహణ కమిటీ సభ్యులు ఐనాల బిక్షం,ఐనాల నవీన్,ఐనాల మైసయ్య,ఐనాల చిన్న ముత్తయ్య,ఐనాల మధు,ఐనాల వెంకన్న,ఐనాల బాబు,ఐనాల వీరస్వామి,ఐనాల కృష్ణ,ఐనాల పుల్లయ్య,ఐనాల నర్సయ్య,ఐనాల రాజేష్,ఐనాల ఉదయ్,ఐనాల శశివర్మ,ఇసంపల్లి వెంకన్న, ఐనాల రాము తదితరులు పాల్గొన్నారు.

## చలో సిర్పూర్ కాగజ్‌నగర్‌కు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి..



**బెల్లంపల్లి,మే31(సూర్యరేఖ)** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జూన్ 1న సిర్పూర్ కాగజ్‌నగర్‌లో నిర్వహించనున్న రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయాలని బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచనల మేరకు మున్సిపల్ కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు,యువజన నాయకులు, మహిళా నాయకులు,కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు,34 వార్డుల కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున సభకు హాజరుకావాలని కోరారు.సభకు వెళ్లే వారు జూన్ 1న మధ్యాహ్నం 2 గంటలలోపు బెల్లంపల్లి క్యాంపు కార్యాలయానికి చేరుకోవాలని,అక్కడి నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారం అవుతోందని,ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## పాలమూరు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మొగుల్ మడ్క జడ్పి ఉన్నత పాఠశాల గిరిజన విద్యార్థినిలు




**దామరగిద్ద,మే31(సూర్యరేఖ)** దామరగిద్ద మండలం మొగుల్ మడ్క జడ్పి ఉన్నత పాఠశాలకు చేందిన ఇద్దరు గిరిజన విద్యర్తులను ట్రిపుల్ ఐటి సీట్లు సాదించి సత్తాచాటారు.సుద్దబండ తాండకు చేందిన వైశాలి టెన్త్ లో 556 మార్కులు, కోమలిబాయి 553 సాదించారు.వీరి ప్రతిభ ఆధారంగా జడ్చర్ల మండలం చిట్టిబోయినాపల్లి శివారులోని పాలమూరు నూతన ట్రిపుల్ ఐటీ క్యాపస్ లో చదువుకొనే అవకాశం దక్కింది. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందిచారు.

## ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునికి సన్మానం..



**కామారెడ్డి,మే31(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కామారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ కైలా శ్రీనివాస్ రావు సన్మానం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో టిపిసిసి ఎన్నారై కువైట్ అధ్యక్షులు పర్వేజ్ హైమద్,కౌన్సిలర్ మహమ్మద్ అమ్జత్ యూత్ కాంగ్రెస్ నాయకులు అఖిల్ సీనియర్ నాయకులు సన్మానం చేయడం జరిగింది.అనంతరం రెడ్డినాయక్ మాట్లాడుతూ... కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరవేస్తానని అన్నారు ఇందిరమ్మఇల్లు మొదటి విడతల్లో పూర్తయిన గృహప్రవేశం సిద్ధంగా ఉన్న వీళ్లను ప్రారంభం చేసి రెండో విడతలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకై తెప్పిస్తానని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను బలోపేతం చేయడానికి మన ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న పథకాలను ప్రజా పాలన సందర్భంగా గడపగడపకు పథకాలు చేరే విధంగా సహకరిస్తానని పేర్కొన్నారు

## రెండో విడత డిగ్రీ సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలి..




**బెల్లంపల్లి,మే31(సూర్యరేఖ)** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడతలో డిగ్రీ సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 5వ తేదీలోగా తప్పనిసరిగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు.దోస్త్ వెబ్‌సైట్ ద్వారా మే25 వరకు రెండో విడత ప్రవేశాల నమోదు ప్రక్రియ కొనసాగగా,మే 30న సీట్ల కేటాయింపు పూర్తైనట్లు తెలిపారు.సీట్లు పొందిన విద్యార్థులు తమ ప్రవేశాన్ని ఖరారు చేసుకునేందుకు నిర్దేశిత గడువులోగా సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని పేర్కొన్నారు.గడువులోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయని పక్షంలో కేటాయించిన సీటు రద్దయ్యే అవకాశం ఉందన్నారు.మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని లేదా 9959269975 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## మరిపెడలో 99రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక సమావేశం..

**హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతిశ్రీపాల్ రెడ్డి**



**మరిపెడ,మే31(సూర్యరేఖ)** 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతిశ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి,ప్రజాసమస్యల పరిష్కారం,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,ప్రజలకు మెరుగైన సేవల అందజేత తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజా పాలనను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయానంద్,కౌన్సిలర్లు నీలా లచ్చిరాం, బాదావత్ బేబీ రవి,కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు పడిదం రాధిక తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డ్ ఈహెచ్ఎస్ కోసం జీతంలో కోత విధించడం సరికాదు..

**ఉట్నూర్ మే31(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించి అధికారికంగా హెల్త్ కార్డులు జారీ చేయకుండానే ముందస్తుగా ఆర్థికశాఖ మే నెల జీతంలో కోతలు విధించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్టు తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు జాదవ్ పాండురంగ,ప్రధాన కార్యదర్శి రాథోడ్ దినేష్ కుమార్ ఆదివారం పత్రిక ప్రకటనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .ఇంతవరకు ఆర్థికశాఖ విధివిధానాలను ప్రకటించకుండానే,ఏ హాస్పిటల్స్ ఈ స్కీం కింద వర్తిస్తాయో తెలపకుండానే,ఎలాంటి వ్యాధులకు సంబంధించి చికిత్సలు చేస్తారో తెలపకుండానే,ముందస్తుగా ఉద్యోగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కోతలు విధించారు.దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు.ఆరోగ్యశాఖకు సంబంధించిన వెబ్సైట్లో ఉద్యోగుల వివరాలు కూడా పూర్తిగా నమోదు కాలేదని,మే 31వరకు నమోదు చేయడానికి అవకాశం ప్రభుత్వం ఇచ్చిందని,ఇంతవరకు పూర్తిగా నమోదు కాకుండానే ఏ విధంగా కోత విధిస్తారని వారు ప్రశ్నించారు.భార్యాభర్తలు ఉద్యోగులైన పక్షంలో ఏ విధంగా నమోదు చేసుకోవాలో ఇంతవరకు ఎలాంటి పూర్తిస్థాయి వివరణ అందుబాటులో ఉంచలేదని,అదేవిధంగా మే30 వరకు కూడా వెబ్సైట్లో చాలా మార్పులు చేశారని,ఇంకా పూర్తిస్థాయి మార్పులు కూడా చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలియజేస్తున్న జీతంలో కోత విధించడం అన్యాయమని వారు చెప్పారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ద్వారా అభిప్రాయాలను సేకరించి,ఆరోగ్య కార్డుల జారీలో మార్గదర్శకాలు తయారు చేసి,విడుదల చేయాలని,ప్రత్యేకంగా ఎవరైతే ఈ పథకంలో చేరడానికి ఆసక్తి చూపుతారో వారికే కోత విధించాలని,ఇష్టం లేని వారికి కోత విధించకుండా నిబంధనలు తయారు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తనకు తానుగా ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యానికి




సంబంధించి రక్షణ తీసుకోవాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునే క్రమంలో ఒక కొత్త విధానానికి శ్రీకారం చుడుతూ,ఉద్యోగుల నుంచి ప్రీమియం చెల్లింపును కోరింది.దీనిని కొన్ని సంఘాలు వ్యతిరేకించాయి.అయిన ప్రభుత్వం ఆరోగ్య కార్డులు జారీకి సిద్ధమైంది.కానీ అందరూ ఉద్యోగులకు ఆరోగ్య కార్డుల కొరకు కోత విధించడం అన్యాయమని, ఉద్యోగుల దగ్గర ఆప్షన్ తీసుకొని మాత్రమే కోతలు విధించాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా ఇప్పుడునెల జీతంలో ముందస్తుగానే కోత విధించారనీ,ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని విధించిన కోతను మళ్ళీ మేనెల జీతంలో కలిపి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధమవుతున్నామని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# వేసవిలో వృథాగా పోతున్న మూసీ నీరు

**రెండు నెలలుగా కుడి కాల్వకు కొనసాగుతున్న నీటి విడుదల**

**పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు**

**ఆందోళనలో ఆయకట్టు రైతులు**



**కేతేపల్లి :** ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుపై సీమాంధ్ర పాలనలో ఉన్న మాదిరిగా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఓ వెలుగు వెలిగిన మూసీ ప్రాజెక్టు అభివృద్ధిలో మళ్లీ వెనుకబడుతోంది. నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడెం నియోజకవర్గాల పరిధిలోని రైతులకు జీవనాధారంగా ఉన్న మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల కాకుండా నిలిపేసి రెండు నెలలు గడుస్తోంది. అయినా ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా యథావిధిగా దిగువకు నీటి విడుదల కొనసాగుతున్నది. కుడి కాల్వ తూము షెట్టర్ మరమ్మతులు చేపట్టాల్సి రావడంతో లీకేజీల ద్వా రా నీరు దిగువకు వెళ్తోంది. షెట్టర్‌ను పైకెత్తిన సందర్భంలో అది కిందకు దిగకుండా అలాగే ఉంటోందని అధికారులు అంటున్నారు. తాత్కాలికంగా షెట్టర్‌కు మరమ్మతులు చేపట్టినప్పటికీ వారం రోజుల్లోనే మళ్లీ లీకేజీలు ఏర్పడుతున్నాయి. నీటిని నిలిపి వేసిన ఏప్రిల్ నుంచి ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం తక్కువగా ఉన్న సమయంలో 30 నుంచి 50 క్యూసెక్కుల వరకు వృథాగా వెళ్లిన నీరు ప్రాజెక్టు నీటిమట్టం పెరిగినకొద్దీ వృథాగా పోతోంది. ప్రస్తుతం 200 క్యూసెక్కులకు పైగా నీరు కుడికాల్వ ద్వారా దిగువకు ప్రవహిస్తోంది. వృథాగా వెళ్తున్న నీటితో బీడు భూములు తడిసిపోతున్నాయి. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతంలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి నీటితో కళకళలాడుతున్నాయి. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోను నిల్వ చేసి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి వానాకాలం సాగుకు నీరందివ్వాలి. ఈ పరిస్థితిని అధికారులు పర్యవేక్షించడంలో విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు.

**కేసీఆర్ పాలనలో మారిన రూపురేఖలు**

మాజీ సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో మూసీ ప్రాజెక్టు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. శిథిలావస్థకు చేరుకున్న ప్రాజెక్టుకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కేసీఆర్ సహకారంతో కోట్ల నిధులు మంజూరు చేయించి ఆయకట్టు ప్రాంత రైతులకు అండగా నిలబడ్డారు.ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీటిని అందించడమే ధ్యేయంగా గత ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది.రూ.19 కోట్లతో ప్రాజెక్టుకు నూతన గేట్లను ఏర్పాటు చేశారు.ఎర్త్‌డ్యాంపై బీటీ రోడ్డును సైతం నిర్మించారు. నూతన గేట్ల ఏర్పాటుతో ప్రాజెక్టు గేట్ల ద్వారా గాని, కాల్వల షెట్టర్ల ద్వారాగాని నీరు వృథాగా వెళ్లేది కాదు.ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో ఏమాత్రం వర్షం కురిసినా వచ్చే ఇన్‌ఫ్లోను అంచనా వేస్తూ అధికారులు రిజర్వాయర్‌లో నీటి నిల్వను పెంచేవారు.నూతన రాష్ట్రం ఏర్పాటుకు ముందు కేవలం యాసంగిలో, అది కూడా ఆరుతడి పంటలకు మాత్రమే సాగునీటిని అందించేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన గేట్లు ఏర్పాటు చేసిన తర్వాత 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునేది. దాంతో నాటి నుంచి వానాకాలంలో కూడా రైతులకు సాగునీటిని అందించేవారు.ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో, రిజర్వాయర్ పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. బీఆర్ఎస్ పాలనలో చివరి ఆయకట్టు రైతులకు సైతం సాగునీరు అందేది.

**638.20 అడుగులుగా మూసీ నీటిమట్టం**

మూసీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 348.37 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది.ప్రస్తుతం కుడి కాల్వకు 200 క్యూసెక్కుల వరకు అవుట్‌ఫ్లో వెళ్తున్నా ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవుట్‌ఫ్లో వెళ్లడం లేదని అధికారులు చెప్పడం గమనార్హం. పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 638.20 అడుగులు(2.82 టీఎంసీలు) ఉన్నట్లు తెలిపారు.

# ఆస్తి తగాదాలు.. యువకుడిపై కత్తితో బంధువుల దాడి

వినాయక నగర్, మే 31 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత కొంతకాలంగా బంధువుల మధ్య కొనసాగుతున్న ఆస్తి తగాదాలు కత్తిపోట్లకు దారితీశాయి. తమ బంధువుల ఇంటికి వచ్చిన యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. నిజామాబాద్ నాలుగవ టౌన్ ఎస్ హెచ్ ఓ సతీష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని అస్మీ కాలనీకి చెందిన సోహెల్ ఖాన్ అనే యువకుడు శనివారం రాత్రి బక్రీద్ సందర్భంగా నగరంలోని పులాంగ్ ప్రాంతంలో ఉండే తమ బంధువులైన షాహిద్ ఖాన్, సాజిద్ ఖాన్‌లను కలిసేందుకు వారి ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో అక్కడ ఉన్న జావిద్ ఖాన్ అతని కుమారులు ఫర్హాన్, జియాన్, వారి బామ్మర్ది అక్బర్‌లు కలిసి సోహెల్‌పై అకారణంగా దాడికి పాల్పడ్డాడు తెలిపారు. అక్బర్ అనే వ్యక్తి కత్తితో సోహెల్ తలపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై రక్తస్రావం అయిందని తెలిపారు. గాయాల పాలైన సోహెల్ కాను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రి తరలించారు. బాధితుడి ద్వారా నాలుగవ టౌన్ ఎస్సై సందీప్ వివరాలు సేకరించారు. అయితే సోహెల్



పై కత్తితో దాడి చేసిన అక్బర్ అనే వ్యక్తికి సాజిద్ ఖాన్‌కు మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయని, దాన్ని దృష్టిలో పెట్టుకొని వారు సోహెల్ ఖాన్‌పై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడి విషయమై బాధితుడి తండ్రి సలీం ఖాన్ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తామని ఫోర్త్ టౌన్ ఎస్ హెచ్ ఓ సతీష్ వెల్లడించారు.

బదిలీల ‘పంచాయితీ’ ముదిరి పాకాన పడింది. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని కొందరు అధికారులు నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నప్పటికీ, తాజా బదిలీల్లో అక్కడి నుంచి కదలకపోవడం విమర్శలకు తావిస్తున్నది. స్థానచలనం నుంచి తప్పించుకునేందుకు అడ్డదారులు సైతం తొక్కుతున్నట్లు తెలుస్తున్నది. ఇక మారుమూల జిల్లాల్లో పనిచేస్తూ.. బదిలీ కావాల్సిన తమకు అన్యాయం జరుగుతుందంటూ ఆ శాఖలోని ఇతర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేయడం కనిపిస్తున్నది. మంచిర్యాల జిల్లా పంచాయతీరాజ్‌శాఖలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి ఒకరు బదిలీ నుంచి తప్పించుకునేందుకు తప్పుడు జాయినింగ్ రిపోర్టులు సమర్పించారన్న విమర్శలున్నాయి. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసిన ఆ ఉద్యోగి బదిలీపై మంచిర్యాలకు వచ్చి పదోన్నతి పొందారు. నిబంధనల మేరకు నాలుగేళ్లు పని చేయడంతో తప్పనిసరిగా సదరు అధికారి బదిలీ కావాలి. కానీ, బదిలీ నుంచి తప్పించుకునేందుకు మంచిర్యాలలో 3 రోజులు ఆలస్యంగా జాయిన్ అయినట్టు తప్పుడు రిపోర్టు సమర్పించి, సదరు అధికారి బదిలీ నుంచి తప్పించుకున్నారని ఆ శాఖలో పనిచేసే ఇతర ఉద్యోగులే చెబుతున్నారు. అప్పుడున్న డీపీవో రిపోర్టుకు, సదరు ఉద్యోగి సమర్పించిన జాయినింగ్ రిపోర్టుకు సంబంధమే లేదు. మంచిర్యాలలో జాయిన్ కావడానికి ముందు రెండు రోజులు ఆదిలాబాద్‌లో పని చేశానని, జీతం కోసమే 1వ తేదీన ఇక్కడ చేరినట్లు చూపించానని సదరు ఉద్యోగి చెబుతున్నా, ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు ఉద్యోగి జాయినింగ్ రిపోర్ట్ తప్పు చూపిస్తే, అడ్డుకోవాల్సిన ఆ శాఖ, జిల్లా ఉన్నతాధికారి ఎందుకు మౌనంగా ఉండిపోవడం, ఆ ఉద్యోగికి వెన్నుదన్నుగా నిలవడంపై పలువురు మండిపడుతున్నారు. ఇక పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న మరో సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగికి నాలుగు సంవత్సరాల సర్వీస్ ఆ జిల్లాలోనే పూర్తయింది. కానీ యూనియన్ ప్రతినిధిగా చెప్పుకొని ఆయన బదిలీ నుంచి మినహాయింపు పొందినట్టు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా బదిలీ కావాల్సిన అధికారులకు యూనియన్ నాయకత్వం ఇంతగా ఎందుకు సపోర్ట్ చేస్తున్నది, ఒకరి స్వార్థం కోసం యూనియన్‌లో మిగిలిన ఉద్యోగులకు అన్యాయం చేస్తారా

## హనుమాన్ బస్తీ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేను కలిసిన పోలు శ్రీనివాస్



**బెల్లంపల్లి,మే31(సూర్యరేఖ)** హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నివాసంలో హనుమాన్ బస్తీ 33వ వార్డు నాయకుడు పోలు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి వార్డులో నెలకొన్న పలు ప్రజా సమస్యలను వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా హనుమాన్ బస్తిలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో రెండు కొత్త బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హనుమాన్ బస్తి--రాంనగర్ మధ్య, హనుమాన్ బస్తి--బాబు క్యాంపు మధ్య వర్షాకాలంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. బస్తిలో సీసీ రోడ్లు,మురుగు కాలువల నిర్మాణం చేపట్టడంతో పాటు విద్యుత్ వోల్టేజ్ సమస్యల నివారణకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా నూతన గ్రంథాలయం, అంగన్‌వాడీ భవనం నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు,రేషన్ కార్డులు,పెన్షన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి దశలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యేకు పోలు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు మంత్రి పొన్నం ప్రభాకర్



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ విజయ రమణారావు, సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు. బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు.ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృధికి కృషి గండ్ర యాదగిరి రావు



**రాజన్న సిరిసిల్ల :** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి సహకారం అందిస్తాం అని నవతేజ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చైర్మన్ గండ్ర యాదగిరి రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మాణం చేశారని, ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. కోరుట్లపేట గ్రామశాఖ అధ్యక్షుడు లోకుర్తి బాలమల్లు, ఆలయ నిర్వాహకులు చిదుగు గోవర్ధన్ గౌడ్, సర్పంచ్ ఇల్లేందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పల్లకిలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు వైభవంగా గిరి ప్రదక్షణ..!



**తంగళ్లపల్లి, మే 31:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు విశేష పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ , స్వామివారి ఉత్సవ మూర్తులకు

# బిజినెస్

## వాహన లీజింగ్‌లోకి ఇసుజు మోటర్స్!




వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఇసుజు మోటర్స్ ఇండియా తమ డీ--మ్యాక్స్ ఎస్--క్యాబ్‌కి సంబంధించి దేశీయంగా లీజింగ్ విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో నాలుగేళ్ల ఫిక్సిడ్ కాలవ్యవధికి, నెలవారీ అద్దె రూ. 38,999 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. సంప్రదాయ ఫైనాన్స్ మోడల్‌తో పోలిస్తే కస్టమర్లకు రూ. 1.81 లక్షల మేర ఆదా అవుతుందని వివరించింది. ఫ్లీట్ ఆపరేటర్లతో పాటు వివిధ వ్యాపార వర్గాల కోసం ఈ సొల్యూషన్‌ని రూపొందించినట్లు కంపెనీ ఎండీ రాజేష్ మిట్టల్ తెలిపారు. ఇసుజు డీ-మ్యాక్స్ ఎస్-క్యాబ్ 2.5-లీటర్ ఎ+ు ఇంటర్‌కూల్డ్ డీజిల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ పొందుతుంది. ఇందులో పెద్ద కార్గో బెడ్‌తో పాటు హెవీ-డ్యూటీ సస్పెన్షన్ సెటప్ కూడా ఉంది, ఇది అధిక డిమాండ్ ఉన్న వాణిజ్య అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. క్యాబిన్ లోపల, డి-మాక్స్ ఎస్-క్యాబ్ ఆరు విధాలుగా సర్దుబాటు చేయగల డ్రైవర్ సీటు, ఎయిర్ కండిషనింగ్, అనేక స్టోరేజ్ స్థలాలు, మల్టీ-ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వంటి ఆచరణాత్మక ఫీచర్లు ఉంటాయి.

## గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!





డిజిటల్ ప్రకటనల రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఒక కేసులో ఢిల్లీ హైకోర్టు, గూగుల్‌పై కీలకమైన తీర్పును వెల్లడించింది. ప్రముఖ బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ అండ్ శానిటరీ వేర్ తయారీ సంస్థ 'హిందవేర్' ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని గుర్తించిన కోర్టు, గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది. హిందవేర్ అనేది భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శానిటరీ వేర్ బ్రాండ్. వినియోగదారులు గూగుల్‌లో ఎఱఅఎఝతీవ అని వెతికినప్పుడు, హిందవేర్ వెబ్‌సైట్‌కు బదులుగా ప్రత్యర్థి కంపెనీల ప్రకటనలు ముందుగా కనిపిస్తున్నాయని సంస్థ గుర్తించింది. దీనికి కారణం.. ఆ కంపెనీలు హిందవేర్ అనే పదాన్ని తమ ప్రకటనల కోసం కీవర్డ్‌గా కొనుగోలు చేయడమే. గూగుల్ యొక్క ాుఔశీతీుం (ప్రస్తుతం గూగుల్ యాడ్స్) వ్యవస్థలో కంపెనీలు తమకు కావలసిన కీవర్డ్లపై బిడ్ వేస్తాయి. వినియోగదారులు ఆ పదాలను సెర్చ్ చేసినప్పుడు, ఎక్కువ బిడ్ వేసిన కంపెనీల ప్రకటనలు పైభాగంలో కనిపిస్తాయి. ఈ విధంగా హిందవేర్ పేరును ప్రత్యర్థులు ఉపయోగించుకోవడం వల్ల వినియోగదారులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కంపెనీ వాదించింది.

### 163 పేజీల తీర్పు

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. గూగుల్ కేవలం ఒక మధ్యవర్తి కాదని స్పష్టం చేశారు. గూగుల్ స్వయంగా కీవర్డ్లను సూచించడం, వాటి వేలాన్ని నిర్వహించడం, ప్రకటనల ప్రదర్శనను తన అల్గోరిథమ్‌ల ద్వారా నియంత్రించడం వంటి చర్యలు చేపడుతోంది. కాబట్టి ట్రేడ్‌మార్క్‌ను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రదర్శించాల్సిన బాధ్యత గూగుల్‌పైనా ఉంటుందని కోర్టు తన 163 పేజీల తీర్పులో పేర్కొంది. కోర్టు అభిప్రాయం ప్రకారం.. హిందవేర్ అనే ట్రేడ్‌మార్క్‌పై గూగుల్‌కు ఎటువంటి యాజమాన్య హక్కు లేదు. అయినప్పటికీ.. ఆ పేరును ప్రత్యర్థి సంస్థలకు అమ్మి లాభం పొందడం ద్వారా గూగుల్ ఆ కంపెనీ ప్రతిష్ఠను వాణిజ్యపరంగా వినియోగించుకుంది. దీనిని కోర్టు ఫ్రీ రైడింగ్ (ఇతరుల కృషి వల్ల ఏర్పడిన పేరును ఉపయోగించి లాభపడటం) అని వెల్లడించింది. గూగుల్ తనను తాను కేవలం ప్రకటనల వేదికగా మాత్రమే పేర్కొంటూ.. హిందవేర్ సమస్యకు తాము బాధ్యులు కాదని వాదించింది. కీవర్డ్స్ అనేవి వినియోగదారుడు సెర్చ్ చేసినప్పుడు.. ప్రకటనలు చూపించడానికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసే కొన్ని సాధనాలు మాత్రమే అని వెల్లడించింది.

# స్మార్ట్ గార్డెన్.. మట్టిలేకుండానే మినీ తోట!








మొక్కలకు నీళ్లు పోయడం నుంచి, పక్షులకు ఆహారం పెట్టడం వరకు... ఇప్పుడు ప్రకృతి పరిరక్షణ కూడా హైటెక్ అయిపోయింది! ఇంట్లోనే ఉంటూ తక్కువ కష్టంతో ఎక్కువ గ్రీనరీని ఎంజాయ్ చేయాలనుకునేవారి కోసం వచ్చేసిన సూపర్ నేచర్ గ్యాడ్జెట్స్ ఇవీ! రోబోటిక్ తోటమాలిఈ వేసవి ఎండల్లో మీరు మాత్రం హాయిగా రూమ్‌లోనో కూర్చుంటే, ఎవరైనా పైపు పట్టుకుని తోటలో నిలబడితే బాగుండు! అని అనుకుంటున్నారా! అందుకే మీ మొక్కలకు నీళ్లు పోసే బాధ్యతను మోయడానికి వచ్చేసింది ఈ సోలార్ స్మార్ట్ వైఫై స్ప్రింక్లర్ టైమర్! ఇది మీ గార్డెన్‌కు ఒక చిన్న డిజిటల్ తోటమాలి లాంటిది. దీనికి జీతం అక్కర్లేదు, కరెంట్ బిల్లుల తలనొప్పి లేదు, ఇందులోని సోలార్ ప్యానెల్‌తో ఎండలోనే ఆటోమేటిక్‌గా రీచార్జ్ అవుతుంది. పైగా మొబైల్ యాప్‌తో కనెక్ట్ చేసి ఎక్కడి నుంచైనా నీళ్లు ఎప్పుడు పట్టాలో కంట్రోల్ చేయొచ్చు. లేదంటే వాయిస్ కంట్రోల్‌తో సోఫాలో కూర్చునే 'అలెక్సా.. మొక్కలకు నీళ్లు పోయ్!' అని చెప్పేస్తే సరిపోతుంది. 'రెయిన్ డిలే' ఫీచర్‌తో 'వర్షం పడుతోంది కదా.. ఎందుకు మళ్లీ నీళ్లు!' అన్నట్టుగా ఆగిపోతుంది. ఐపీ65 వాటర్‌ప్రూఫ్ బాడీ, బలమైన బ్రాస్ ఇన్లెట్‌తో ఎండా వానలకు తట్టుకునే ఈ రోబోటిక్ తోటమాలి ధర రూ. 10,180 మాత్రమే!

### పక్షుల కోసం స్మార్ట్ హోటల్!

ఉదయం కిటికీ దగ్గరకు వచ్చే పిచ్చుకలు, చిన్న చిన్న పక్షులను దగ్గరగా చూడాలని అనిపిస్తుందా? అయితే మీ ఇంటికే చిన్న బర్డ్ థియేటర్‌లా మారిపోయే ఈ సోలార్ ఏఐ బర్డ్ ఫీడర్ మీ కోసం! ఇది కేవలం గింజలు పెట్టే పాత్ర మాత్రమే కాదు, పక్షుల ప్రపంచాన్ని మీ కళ్ల ముందుకు తీసుకొచ్చే స్మార్ట్ గాడ్జెట్. దీనిలో ఉన్న కెమెరా పక్షులు వచ్చి గింజలు తింటున్న ప్రతి క్యూట్ మూమెంట్‌ను క్యాప్చర్ చేస్తుంది. పైగా ఇందులో ఉన్న ఏఐ టెక్నాలజీ ఏ పక్షి వచ్చిందో కూడా గుర్తించగలదు. సోలార్ పవర్‌తో పనిచేయడం వల్ల బ్యాటరీల తలనొప్పి ఉండదు. వర్షం, ఎండలకు తట్టుకునే వెదర్‌ప్రూఫ్ మెటల్ బాడీతో తయారైన ఈ స్మార్ట్ ఫీడర్ ధర రూ. 7,000 మాత్రమే!

### మట్టిలేకుండానే మినీ తోట!

ఇంట్లోనే తాజా పుదీనా, తులసి లేదా చిన్న చిన్న కూరగాయలు పెంచుకోవాలని ఉందా? కానీ మట్టి, కుండీలు, రోజూ నీళ్లు పోసే టెన్షన్ వద్దనుకుంటున్నారా? అయితే ఈ హైడ్రోపోనిక్ గ్రోయింగ్ సిస్టమ్ మీ కోసం! ఇది మీ ఇంట్లోనే ఒక చిన్న స్మార్ట్ ఫార్మ్‌లా పనిచేస్తుంది. ఇందులో మొత్తం 12 ప్లాంటింగ్ స్టేషన్స్ ఉంటాయి. మట్టికి బదులుగా నీరు, పోషకాలు, ఎల్ఈడీ కాంతితో మొక్కలు వేగంగా పెరిగేలా చేస్తుంది. ఇందులో ఉన్న స్మార్ట్ ఎల్ఈడీ లైట్లు సూర్యరశ్మిలా పనిచేసి మొక్కలకు అవసరమైన కాంతిని ఇస్తాయి. 4.2 లీటర్ల పెద్ద వాటర్ ట్యాంక్, ఆటోమేటిక్ వాటర్ సర్క్యులేషన్ సిస్టమ్‌తో మొక్కలకు కావాల్సిన నీరు, ఆక్సిజన్ నిరంతరం అందుతాయి. లైట్ స్టాండ్ ఎత్తును కూడా మొక్కల పెరుగుదలకు తగ్గట్టు మార్చుకోవచ్చు. ధర రూ. 14,000 మాత్రమే!

# స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఢమాల్!

పెరిగిన ధరలతో 30 శాతం వరకు పడిపోయే అవకాశం



న్యూఢిల్లీ, మే 30: దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల విక్రయాలకు ధరల పెంపు సెగ గట్టిగానే తాకనున్నది. రూపాయి పతనంతో మొబైల్ తయారీ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలు పెంచిన సంస్థలకు అమ్మకాల రూపంలో షాక్ తగలబోతున్నది. వచ్చే పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 30 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉన్నదని నివేదిక వెల్లడించింది. జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ధరలు మరోసారి పెరిగితే వార్షికంగా స్మార్ట్‌ఫోన్ సేల్స్ భారీగా పడిపోనున్నాయని ట్రైకిన్ టెక్నాలజీ, టెకేర్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 6 వేల మంది యాక్టివ్ మొబైల్ కొనుగోలుదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 48 మంది వచ్చే ఆరు నెలల్లో ఫోన్ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదావేసుకుంటున్నట్టు చెప్పారు. కానీ, ఆరు శాతం మంది తమ వద్ద ఉన్న ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ ఇచ్చి ఇతర స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు భవిష్యత్తులోనూ కొనసాగితే వచ్చే ఆరు నెలల్లో స్మార్ట్‌ఫోన్ల డిమాండ్ 11-12 కోట్లకు పడిపోనున్నట్టు తెలిపింది. రూ.20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సరాసరిగా 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగాయి. ధరల పెరుగుదలే అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని టెకేర్ ఫౌండర్ ఫైజల్ కవూసా తెలిపారు. గడిచిన ఏడాదికాలంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువు ఐదు శాతం పడిపోయింది. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్ హ్యాండ్ మొబైళ్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు.

# ఐపీఎల్ ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ!




ఐపీఎల్ 2026 సీజన్‌లో ఎక్కువగా వార్తల్లో నిలిచిన పేరు రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. బ్యాటింగ్ చేసినా, ఫీల్డింగ్ చేసినా, తిన్నా, పడుకున్నా.. ఇలా అతడు ఏం చేసినా అది వార్తగానే నిలిచేది. ఎలిమినేటర్‌లో ఎస్ఆర్‌హెచ్‌ను చిత్తు చేసినప్పటికీ క్వాలిఫయర్-2 పోరులో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమి పాలయిన రాజస్తాన్ రాయల్స్ సీజన్‌ను మూడో స్థానంతో ముగించింది. జట్టు ఓటమి పాలైనప్పటికీ వైభవ్ మాత్రం సూపర్ సక్సెస్ అయ్యాడు. వైభవ్ సూర్యవంశీ ఆటను మరొక్కసారి చూస్తే బాగుంటుందని అభిమానులు ఆశపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ అభిమానులకు ఒక శుభవార్త. అతడి ఆటను చూడలేకపోవచ్చు కానీ అతడిని స్టేడియంలో మరోసారి చూసే అవకాశం మాత్రం దక్కనుంది. అహ్మదాబాద్ వేదికగా నేడు ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు వైభవ్ సూర్యవంశీ హాజరుకానున్నాడు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో వైభవ్ తళుక్కుమన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫైనల్ మ్యాచ్ చూసేందుకు వైభవ్ తన కుటుంబంతో కలిసి అహ్మదాబాద్ వచ్చినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఫైనల్ మ్యాచ్ ముగిసిన అనంతరం వైభవ్ సూర్యవంశీని ప్రత్యేకంగా సన్మానించే అవకాశం కూడా ఉంది. ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఒకవేళ ఇవాల్టి ఫైనల్లో గిల్, సాయి సుదర్శన్ తక్కువ స్కోర్లకు వెనుదిరిగితే మాత్రం వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకునే చాన్స్ ఉంది. ఈ సీజన్ ఆరంభం నుంచి స్థిరమైన ప్రదర్శన కొనసాగిస్తూ వచ్చిన వైభవ్ ఒక సెంచరీ సహా ఐదు అర్ధసెంచరీలు సాధించాడు. సీజన్‌లో 72 సిక్సర్లతో ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రికెటర్‌గా నిలిచాడు. ఇక గుజరాత్‌తో మ్యాచ్‌లో 47 బంతుల్లో 96 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. ఇక ఎలిమినేటర్ పోరులోనూ ఎస్ఆర్‌హెచ్‌పై సునామీ ఇన్నింగ్స్ ఆడిన వైభవ్ 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి ఔటయ్యాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ అతడి ఆటతో అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు.

## గర్వంగానే ఉంది.. నన్ను ఇరకాటంలో పెట్టొద్దు: అగార్కర్




టీమిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా అజిత్ అగార్కర్ వచ్చిన తర్వాత చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ విషయంలో అతడి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో కలిసి కఠిన నిర్ణయాలు తీసుకుందనేది బహిరంగ రహస్యమే. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్‌ను గెలిపించిన తర్వాత.. మరుసటి సిరీస్ నుంచే రోహిత్ శర్మ (=శీష్ట్రణ్ జాష్ట్ఝతీఝ)ను కెప్టెన్సీ నుంచి తప్పించారు. ఇక సంజూ శాంసన్‌ను కాదని.. టెస్టు, వన్డే జట్ల సారథి శుబ్‌మన్ గిల్‌ను టీ20 ఓపెనర్‌గా దించి నాయకత్వ బృందం భారీ మూల్యమే చెల్లించింది.

గిల్‌పై వేటు వేసి..

అయితే, పొరపాటును గ్రహించిన అగార్కర్ బృందం.. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీకి ముందు సంచలన నిర్ణయం తీసుకుంది. గిల్‌పై వేటు వేసి.. ఇషాన్ కిషన్‌ను ప్రపంచకప్ జట్టులో కొనసాగించింది. ఇక స్వదేశంలో జరిగిన ఈ మెగా ఈవెంట్లో భారత్ ట్రోఫీ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో నాకౌట్ మ్యాచ్‌లలో గొప్పగా రాణించిన ఓపెనర్ సంజూ శాంసన్ (97లి, 89, 89) ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు అందుకున్నాడు. ఏదేమైనా.. ఏ సిరీస్‌కు భారత జట్టును ప్రకటించినా అగార్కర్‌పై విమర్శలు రావడం సహజమే. ఈ విషయం గురించి అతడు తాజాగా స్పందించాడు. ముంబైలో శనివారం జరిగిన క్రిక్‌ఇన్ఫో అవార్డు ప్రదానోత్సవానికి అగార్కర్ హాజరయ్యాడు. ఈ సందర్భంగా ప్రజెంటర్ డానిష్ సైట్ (ఆర్సీబీ మిస్టర్ నాగ్స్‌గా పాపులర్) అతడిని తన ప్రశ్నలతో ఇరుకున పెట్టాడు. 'అబ్బ.. ఎంత గొప్ప జట్టును ఎంపిక చేశానో' అని మీరు మురిపిసోయిన సందర్భాలు ఉన్నాయా? నేను చాలా జాగ్రత్తగా మాట్లాడాల్సి ఉంటుంది. లేదంటే నా మాటల్ని ఇష్టమొచ్చినట్లుగా వక్రీకరిస్తారు!.. ఏదేమైనా జట్టు గెలిచిన సందర్భంలో.. ఆ క్షణంలో నాకు గర్వంగానే ఉంటుంది. సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా మంచి జట్టును ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉంటుంది. మన దేశంలో 140 కోట్లకు పైగా జనాభా ఉన్నారు. క్రికెట్ అభిమానుల దృష్టి మీపైనే ఉంటుంది. మరి ఓ ఆటగాడికి అవకాశం ఇవ్వలేనప్పుడు.. 'సారీ మ్యాన్.. ఈసారి కాదు గానీ.. మళ్లీ వచ్చే సిరీస్‌కు చూద్దాంలే' అని మీరు అతడికి చెప్పగలరా? ఇందుకు మీరు ఎలాంటి మార్గం

# స్పోర్ట్స్

## ఆస్ట్రేలియాను చిత్తు చేసిన పాకిస్తాన్




ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో పాకిస్తాన్ శుభారంభం చేసింది. శనివారం రావాల్పిండి వేదికగా జరిగిన తొలి వన్డేలో ఆసీస్‌ను 5 వికెట్ల తేడాతో పాక్ చిత్తు చేసింది. తమ 1,000 వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. పాక్ బౌలర్ల ధాటికి 44.1 ఓవర్లలో 200 పరుగులకే కుప్పకూలింది. అరంగేట్ర ఆటగాడు అరాఫత్ మిన్హాస్ 5 వికెట్లు పడగొట్టి కంగారుల పతనాన్ని శాసించాడు. జోష్ ఇంగ్లిష్, గ్రీన్, లబుషేన్ వంటి కీలక వికెట్లను అరాఫత్ తన ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా వన్డే అరంగేట్రంలో 5 వికెట్లు పడగొట్టిన తొలి పాక్ బౌలర్‌గా మిన్హాస్ నిలిచాడు. ఇక ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా(61), మాథ్యూ షార్ట్(55) మినహా మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో మిన్హాస్‌తో పాటు అబ్రార్ రెండు, రౌఫ్, అఫ్రిది, అఘా తలా వికెట్ సాధించారు.

### బాబర్, ఘోరి హాఫ్ సెంచరీలు

అనంతరం పాకిస్తాన్ 32 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. అయితే స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం (69), వికెట్ కీపర్ బ్యాటర్ ఘాజీ ఘోరి (65) మూడో వికెట్‌కు 127 పరుగుల అద్భుత భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనప్పటికి మిన్హాస్(18), సమద్(1) అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ఫినిష్ చేశారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఈల్లీస్ రెండు, మాథ్యూ కునెమన్, తన్వీర్ సంగా, లబుషేన్ తలా వికెట్ సాధించారు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే జూన్ 2న లహోర్ వేదికగా జరగనుంది.



# 'రాకా' నుంచి గ్లింప్స్ రాబోతుందా?

## అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!

'పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. సినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే 'రాకా' ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వెండితెరపై ఎంట్రీ ఇస్తున్న 'రాను బొంబాయికి రాను' భామ!



'రాను బొంబాయికి రాను' ఫోక్ సాంగ్ ఎంత సూపర్ హిట్ అయిందో అందరికి తెలిసిందే. లిరిక్స్ కంటే ఎక్కువగా రామ్ రాథోడ్, లిఖిత వేసిన స్టెప్పులు బాగా వైరల్ అయ్యాయి. అంతేకాదు ఈ ఒక్క పాటతో లిఖిత..తెలుగు ఆడియన్స్‌కి బాగా దగ్గరైంది. ఈ పాట తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళ్తుంది. అయితే ఇన్నాళ్లు ప్రైవేట్ ఆల్బమ్స్‌తో అలరించిన లిఖిత..ఇక ఇప్పుడు హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఆమెను టాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాడు. సామ్రాట్, డీమోన్ పవన్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'సాం3' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ రోజు పూజా కార్యక్రమాలతో 'సాం3' సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ – డైరెక్టర్ గారు ఈ స్క్రిప్ట్ చెబుతున్నప్పుడే మూవీ ఎలా ఉంటుంది అనేది క్లియర్ గా తెలిసింది. నేను ఫోక్ సాంగ్స్ నుంచి చిన్న గ్యాప్ తీసుకున్నాను. హీరోయిన్ గా మంచి రోల్స్ చేయాలనే ఫోక్ సాంగ్స్ కు గ్యాప్ ఇచ్చాను. అయినా మంచి ఆల్బమ్ వస్తే తప్పకుండా చేస్తాను. నేను ఒక బెస్ట్ స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్న టైమ్ లో ఈ మూవీ ఆఫర్ వచ్చింది. సామ్రాట్, పవన్ లాంటి కోస్టార్స్ దొరకడం హ్యాపీగా ఉంది. ఎలాంటి స్క్రిప్ట్ పేపర్ లేకుండా మేమంతా కథను ఓన్ చేసుకుని నటించాం. అదంతా మా డైరెక్టర్ వల్లే సాధ్యమైంది' అన్నారు. దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ... లిఖి, డీమోన్ పవన్ కొత్త వాళ్లు ఎలా నటిస్తారో అనుకున్నాను గానీ పర్ ఫార్మెన్స్ ఇరగదీశారు. మా టెక్నీషియన్స్ అందరూ అద్భుతమైన ఔట్ పుట్ ఇచ్చారు. 'సాం3' సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం' అన్నారు. హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ – బిగ్ బాస్ తర్వాత నేను ఎలాంటి మూవీ చేయాలని ఆలోచిస్తున్న టైమ్ లో డైరెక్టర్ కృష్ణ మాయ ఈ స్క్రిప్ట్ చెప్పారు. చాలా మంచి స్క్రిప్ట్ ఇది. ఆయన స్క్రిప్ట్ చెబుతుంటే ఇంకా వినాలని అనిపించింది. అంత ఎక్స్ ప్రెసివ్ గా స్టోరీ చెప్పారు. ఇలాంటి దర్శకుడితో వర్క్ చేస్తే నటుడిగా నాకు మంచి పేరొస్తుందని నమ్మాను. మేమంతా ఈ సినిమా కోసం ఎలాంటి డైలాగ్స్ లేకుండా ఆన్ సెట్ ఇంప్రూవైజ్ చేసుకుంటూ నాచురల్ గా నటించాం. తక్కువ టైమ్ లో మేమంతా క్వాలిటీగా సినిమా చేశాం. అన్నారు.



# శింబు టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమా?.. తెలుగు డెబ్యూపై మళ్లీ జోరందుకున్న చర్చ

కోలీవుడ్ స్టార్ హీరో శింబుకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. ఆయన నటించిన అనేక తమిళ చిత్రాలు తెలుగులో డబ్బింగ్ అయి మంచి విజయాలు సాధించడంతో టాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఇంతటి క్రేజ్ ఉన్నప్పటికీ శింబు ఇప్పటివరకు నేరుగా తెలుగు సినిమాలో నటించలేదు. దీంతో ఆయన టాలీవుడ్ ఎంట్రీ గురించి తరచూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని నెలలుగా శింబు ఓ ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థతో సినిమా చేయబోతున్నారనే ప్రచారం సాగుతోంది. గతంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో శింబు హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. మనసనమహా' షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు దీపక్ రెడ్డి చెప్పిన కథ నిర్మాతలను ఆకట్టుకుందని, శింబు కూడా ఆ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆ తర్వాత ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.ఇప్పుడు తాజాగా మరో కొత్త కథతో శింబు ముందుకు వచ్చినట్లు సమాచారం. యువ దర్శకుడు కీర్తిశ్వరన్ చెప్పిన కథ ఆయనను బాగా ఆకట్టుకుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన 'డ్యూడ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తిశ్వరన్, కొత్త తరహా కథాంశంతో శింబును మెప్పించినట్లు తెలుస్తోంది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇక శింబు కెరీర్ విషయానికి వస్తే, బాలనటుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన ఆయన 2002లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. ప్రేమకథలు, యాక్షన్ డ్రామాలు, మాస్ ఎంటర్‌టైనర్‌లతో తమిళ ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోగా ఎదిగారు. ఒక దశలో తెలుగులో కూడా ఆయన సినిమాలకు మంచి మార్కెట్ ఏర్పడింది. అయితే వరుస పరాజయాలు, వ్యక్తిగత వివాదాల కారణంగా కొంతకాలం కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తిరిగి వరుస విజయాలతో బలంగా కమ్‌బ్యాక్ ఇచ్చిన శింబు, ప్రస్తుతం తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు మార్కెట్‌పై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు తమిళ హీరోలు నేరుగా తెలుగు సినిమాలు చేసి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో శింబు కూడా అదే బాటలో నడవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



# ఏడేళ్ల ప్రేమకు పెళ్లి ముహూర్తం..

## ప్రియాంక జైన్‌తో వివాహంపై క్లారిటీ ఇచ్చిన శివకుమార్

తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ఎంతో పరిచయమైన జంటల్లో ప్రియాంక జైన్, శివకుమార్ ఒకరు. 'మౌనరాగం' సీరియల్ ద్వారా పరిచయమైన వీరిద్దరూ మొదట మంచి స్నేహితులుగా మారి, ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ప్రస్తుతం లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో కూడా కొనసాగుతోంది.వీరి ప్రేమ వ్యవహారం గురించి అభిమానులకు ఎప్పటి నుంచో తెలుసు. దీంతో సోషల్ మీడియాలోనూ, ఇంటర్వ్యూల్లోనూ వీరిద్దరికి తరచూ ఎదురయ్యే ప్రశ్న ఒక్కటే.. "పెళ్లి ఎప్పుడు?" అనే విషయం. తాజాగా ఈ ప్రశ్నకు శివకుమార్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు.ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ ప్రేమ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మాది ఏడేళ్ల ప్రేమ. మొదట ప్రియాంకే నాకు ప్రపోజ్ చేసింది. ఆమె ప్రపోజ్ చేసిన రెండు రోజుల తర్వాత నేను ఓకే చెప్పాను. అప్పటి నుంచి మా బంధం మరింత బలపడింది అని తెలిపారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌పై కూడా ఆయన స్పందించారు. మేము కలిసి ఉండటానికి ముందే మా కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నాం. రెండు కుటుంబాలు కూడా మా నిర్ణయాన్ని గౌరవించాయి. వారి అంగీకారంతోనే మేము లివ్-ఇన్‌లో ఉన్నాం అని చెప్పారు. పెళ్లి విషయానికి వస్తే, ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఒక ఇంటిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మా కలల ఇల్లు నిర్మాణంలో ఉంది. అది పూర్తయిన వెంటనే ఈ ఏడాదిలోనే పెళ్లి చేసుకుంటాం. పెళ్లి కోసం ఇప్పటికే కొన్ని ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నాం అని అన్నారు. తమ వివాహాన్ని ఉత్తరాఖండ్‌లోని ఓ పవిత్ర ఆలయంలో నిర్వహించాలని భావిస్తున్నట్లు శివకుమార్ తెలిపారు. యోగి నారాయణ్ ఆలయంలో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం. పురాణాల ప్రకారం శివపార్వతుల వివాహం కూడా అక్కడే జరిగినట్లు చెబుతారు. అందుకే ఆ ప్రదేశం మాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది అని వివరించారు.ఆలయంలో సాంప్రదాయబద్ధంగా వివాహం జరిగిన అనంతరం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే భవిష్యత్తులో నిర్మిస్తున్న ఇంట్లో రెండు కుటుంబాలు కలిసి ఉండేలా ప్రణాళికలు వేసుకున్నామని వెల్లడించారు. నేను నా కుటుంబంతో, ప్రియాంక తన కుటుంబంతో కాకుండా అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండాలని కోరుకుంటున్నాం. కుటుంబ బంధాలకు మేము ఎంతో విలువ ఇస్తాం అని శివకుమార్ తెలిపారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713